అసైన్డ్ రైతుల ఖాతాల్లో
వార్షిక కౌలు జమ

- తొలి విడతగా రూ. 22.03 కోట్లు
- వైకాపా హయాంలో మూడేళ్ల పాటు పెండింగ్
- సీఐడీ విచారణ పేరుతో కాలయాపన

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - తుళ్లూరు



రాజధానిలోని అసైన్డ్ రైతుల బ్యాంకు ఖాతాల్లో వార్షిక కౌలు జమైంది. సీఐడీ క్లియరెన్సు ఇచ్చిన రైతుల వివరాలు పరిశీలించి.. సీఆర్డీఏ అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేయడంతో నిధులు జమయ్యాయి. గత మూడేళ్లుగా వైకాపా సర్కారు కారణంగా కౌలు రాక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో మూడేళ్ల కౌలు పడడంతో ఊరట లభించింది. సీఐడీ విచారణ పేరుతో జగన్ ప్రభుత్వం అసైన్డ్ రైతులకు కౌలు నిలిపేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. అసైన్డ్ రైతుల సమస్యలను పరిష్కరించాలని సీఆర్డీఏ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మొదటి విడతలో ఇటీవల పలువురు అర్హులను గుర్తించి వారికి మంజూరు చేశారు. మిగిలిన వాటిని కూడా పరిశీలించి వచ్చే రెండు, మూడు నెలల్లో పరిష్కరించి న్యాయం చేయాలన్న పట్టుదలతో ఉన్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ తెలిపారు.

మూడేళ్లు నరకం అనుభవించారు

రాజధానిలో భూముల విషయంలో కుంభకోణం జరిగిందని వైకాపా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. 2014 - 19 మధ్య కాలంలో జరిగిన అసైన్డ్ భూముల లావాదేవీలపై విచారణ చేస్తోంది. ఈ నేపథ్యంలో అప్పటి వైకాపా ప్రభుత్వం 2021 నుంచి అసైన్డ్ రైతులకు కౌలు నిలిపేసింది. రాజధాని నిర్మాణం కోసం సమీకరణ కింద వచ్చిన భూముల్లో ఆరు విభాగాలకు చెందిన 3 వేల మందికి సంబంధించి 2,689.14 ఎకరాల మేర అసైన్డ్ భూములున్నాయి. దర్యాప్తు ఇప్పటికే చాలా వరకు పూర్తయినా, మళ్లీ సీఐడీ అధికారులు తిరగదోడారు. దీనివల్ల జగన్ హయాంలో అసైన్డ్ రైతులకు జీవనాధారం కరవైంది. కౌలు ఎప్పుడు వేస్తారోనని కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురుచూశారు. 3,189 మంది అసైన్డ్ రైతుల్లో కౌలుకు అర్హులుగా 2,472 మందిని గుర్తించారు. వారికి కూడా కౌలు ఇవ్వకుండా ప్రభుత్వం పక్కన పెట్టేసింది.

1,234 మందికి...

సమస్యలు లేని అసలు పత్రాలతో సరిపోలిన 1,479 అసైన్డ్ రైతుల వివరాలను గుంటూరు కలెక్టర్ కార్యాలయం నుంచి సీఆర్డీఏ సేకరించింది. అధికారులు అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి 1, 2, 3 కేటగిరీల్లో విభజించారు. 1,328.17 ఎకరాలకు సంబంధించి 1,234 మంది అసైన్డ్ రైతులను అర్హులుగా గుర్తించారు. వీరిని కౌలు చెల్లింపునకు అర్హులుగా గుర్తించి, జమ చేస్తున్నట్లు సీఐడీ, గుంటూరు కలెక్టర్, ప్రభుత్వానికి సీఆర్డీఏ అధికారులు సమాచారం ఇచ్చారు. వారి నుంచి ఎన్వోసీలు తీసుకున్నారు. వీరికి సంబంధించి రూ. 22.03 కోట్లకు బిల్లులను ఇటీవల సీఎఫ్ఎంఎస్‌లోకి అప్‌లోడ్ చేశారు. ఇది ఆర్థిక శాఖ ఆమోదం లభించడంతో రైతుల ఖాతాల్లో జమయ్యాయి. సీఐడీ అధికారులు తిరస్కరించిన జాబితాలో ఉన్న మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు సీఆర్డీఏ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇవి రెండు, మూడు నెలల్లో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది..

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా కందుల దుర్గేష్



ఈనాడు, అమరావతి: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈయన తూర్పుగోదావరి జిల్లాకు చెందినవారు. జిల్లాలో ప్రగతి పనులన్నీ ఇన్‌ఛార్జి మంత్రి హోదాలో దుర్గేష్ పర్యవేక్షించనున్నారు. జిల్లాలో ఎంపీ, ఆరుగురు ఎమ్మెల్యేలు తెదేపా నుంచి గెలుపొందగా తెనాలి నుంచి నాదెండ్ల మనోహర్ జనసేన తరఫున ఎన్నికయ్యారు. కూటమి నేతలను సమన్వయం చేసుకుని ప్రగతిని పట్టాలెక్కించాల్సిన బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రిపై ఉంది. జిల్లాలో రాజధాని ప్రాంతం కూడా ఉండడంతో ఆయన పాత్ర కీలకం కానుంది. గుంటూరు వాహిని పొడిగింపు, విస్తరణ, పలు రోడ్ల అభివృద్ధి, రైల్వేమార్గంలో ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణం, నూతన పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉపాధి కల్పన వంటి అంశాలపై దృష్టి సారించాల్సి ఉంది. మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి, పెదకాకాని శివాలయం, తెనాలి వైకుంఠపురం వెంకటేశ్వరస్వామి ఆలయం, ఉప్పలపాడు పక్షుల కేంద్రం, పంచారామాల్లో ప్రథమారామం అమరావతిని పర్యటక సర్క్యూట్‌గా చేసి పర్యటక, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయాలన్న డిమాండ్ కొన్నేళ్లుగా ప్రతిపాదనల దశకే పరిమితమైంది. పర్యటకశాఖ మంత్రిగా ఉన్న దుర్గేష్ తమ కల నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు.

కూటమి వచ్చింది.. వంతెన తెచ్చింది..

ఈనాడు - అమరావతి

- నిర్మాణానికి రూ. 98 కోట్లు
- ఆమోదం తెలిపిన కేంద్రం
- నెరవేరనున్న గుంటూరువాసుల కల
- ఆర్వోబీ విస్తరణ ఆవశ్యకతపై కథనాలిచ్చిన 'ఈనాడు'
- ఫలించిన కేంద్రమంత్రి పెమ్మసాని ప్రయత్నం

గుంటూరు నగరంలో అత్యంత కీలకమైన శంకర్‌విలాస్ ఆర్వోబీ పనుల కోసం రూ. 98 కోట్ల విడుదలకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో దశాబ్దాల సమస్య పరిష్కారం కానుంది. వంతెన విస్తరణ పనులకు మార్గం సుగమమై.. గుంటూరువాసుల కల నెరవేరనుంది. ఈ వంతెన విస్తరణ ఆవశ్యకత, ఎదురవుతున్న అడ్డంకులపై ఎప్పటికప్పుడు 'ఈనాడు' కథనాలిచ్చింది. గత ఎన్నికల్లో గుంటూరు లోక్‌సభ స్థానానికి పోటీ చేసిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శంకర్‌విలాస్ వంతెన విస్తరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన కేంద్ర సహాయమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, మున్సిపల్, రైల్వే అధికారులతో సమీక్షలు నిర్వహించారు. వంతెన విస్తరణకు ఎదురవుతున్న అడ్డంకులను తొలగించి, దీని ఆవశ్యకతను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు రాబట్టడంలో సఫలీకృతులయ్యారు.

తాజాగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదికగా నిధుల ఆమోదం విషయాన్ని వెల్లడించారు

వరుస సమీక్షలతో ముందడుగు

- శంకర్‌విలాస్ వంతెన ప్రాధాన్యం దృష్ట్యా కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తొలుత స్థానిక విభాగాల మధ్య సమన్వయం లేదని గుర్తించి, అందరితోనూ సమావేశమై ప్రాజెక్టు నివేదిక తయారు చేయాలని సూచించారు. ఇందుకు నిర్ణీత గడువు విధించి ప్రస్తుత ధరలకు అనుగుణంగా అంచనాలు సిద్ధం చేయించారు.
- భూసేకరణ, యుటిలిటీస్ తరలింపు వంటి వాటికి నగరపాలకసంస్థ బాధ్యత తీసుకుని అంగీకార లేఖను ఆర్‌అండ్‌బీ విభాగానికి ఇచ్చేలా చేశారు.
- భూసేకరణ, సవివర ప్రాజెక్టు నివేదిక, అంచనాలు సిద్ధం చేసి కేంద్రానికి పంపి నిధులు విడుదల చేయాలని కోరారు.
- ఆర్‌అండ్‌బీ, రైల్వే, జీఎంసీ అధికారులు.. సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకెళ్లేలా మార్గనిర్దేశం చేశారు.
- నిధులు విడుదల చేయాలంటూ జులై 30న కేంద్రమంత్రికి లేఖ రాశారు. కేంద్ర రహదారి, మౌలిక వసతుల నిధి సేతు బంధన్ పథకం కింద నిధులు కేటాయించాలని కేంద్రమంత్రిపై ఒత్తిడి తెచ్చారు.

1.21 కిలోమీటర్ల వంతెన

గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి అరండల్‌పేట పదోలైను వరకు 1.21 కిలోమీటర్ల దూరం ఉన్న వంతెన స్థానంలో నాలుగు వరుసలతో నిర్మిస్తారు. ఇందుకోసం ఇరువైపులా భూసేకరణ జాబితాను నగరపాలకసంస్థ సిద్ధం చేసింది. ఇరువైపులా సర్వీసు రోడ్లు, ఇతర అవసరాలకు భూమి వివరాలు సేకరించింది. రెండువైపులా 30 అడుగుల వెడల్పుతో సర్వీసు రోడ్లు ఏర్పాటు చేస్తారు. ఈ వంతెన నిర్మాణానికి రూ. 108 కోట్ల వరకు అవసరమని ఆర్‌అండ్‌బీ అంచనా వేశాక కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారు. ఇందులో రైల్వేశాఖ తరఫున 50 మీటర్ల మేర పనులకు రూ. 20.85 కోట్లు అవసరమని 2024-25 ఎస్ఎస్ఆర్‌కు అనుగుణంగా అంచనా వేశారు. ఇప్పటికే ఉన్న విద్యుత్తు తీగలు, మురుగుకాలువలు, ఇతరత్రా విభాగాలకు చెందినవాటిని మరోచోటకు తరలించి అమర్చడానికి కొంత కేటాయించారు. భూసేకరణకు రూ. 8 కోట్లమేర అవసరమవుతుంది. ప్రస్తుతం ఉన్న ఆర్వోబీని తొలగించి వ్యర్థాలను తొలగించడానికి రూ. కోటి అవసరమని అంచనా వేశారు. ఇలా మొత్తం పనులతోపాటు పన్నులు కలిపి రూ. 108 కోట్లతో ప్రతిపాదనలు పంపగా.. కేంద్రం రూ. 98 కోట్లకు ఆమోదం తెలిపింది. మిగిలిన మొత్తాన్ని జీఎంసీ వెచ్చించాల్సి ఉంది.

ఎంతో కీలకం...

- ★ గుంటూరు-నల్లపాడు రైల్వే సెక్షన్‌లో లెవల్ క్రాసింగ్ 497వద్ద 1958లో ఆర్వోబీ నిర్మించారు.
- ★ ప్రస్తుతం ఇది శిథిల స్థితికి చేరుకుంది. ప్రస్తుత అవసరాలకు సరిపోక ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.
- ★ వంతెనకు ఒకవైపు గుంటూరు ప్రభుత్వాసుపత్రి, గుంటూరు వైద్యకళాశాల ఉన్నాయి. అత్యవసర సమయాల్లో రోగులు ట్రాఫిక్‌లో విలవిల్లాడుతున్నారు.
- ★ గుంటూరు రైల్వేస్టేషన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇతర సంస్థలకు చేరుకోవాలంటే శంకర్ విలాస్ వంతెనే కీలకం. ఉదయం, సాయంత్రం వేళల్లో అత్యంత రద్దీ ఉంటోంది. ఇంధనం వృథా అవుతోంది.



శంకర్ విలాస్ వంతెన

నేటి నుంచే కోరుకున్న మద్యం



ఈనాడు - అమరావతి

ప్రభుత్వ మద్యం దుకాణాలకు మంగళవారంతో తెరపడింది. బుధవారం నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి వస్తోంది. ఈ విధానంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు కలిపి 373 ప్రైవేటు దుకాణాలకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులు లైసెన్సులు మంజూరు చేశారు. వీటిని మంగళవారమే తీసుకున్న వ్యాపారులు ఆయా ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఇప్పటివరకు ప్రభుత్వ దుకాణాలు నడిపిన ప్రదేశాల్లోనే ప్రైవేటువి ఏర్పాటు చేసుకోవడానికి సంబంధిత భవనాల యజమానులతో సంప్రదింపులు జరుపుతున్నారు. అవసరమైతే ఎక్కువ అద్దె చెల్లించేందుకూ ముందుకొస్తున్నారు.

వాటాల కోసం సంప్రదింపులు!

మద్యం వ్యాపారంలో అనుభవం ఉన్న చాలామంది సిండికేట్లుగా ఏర్పడి దరఖాస్తులు చేశారు. వీరికి చాలా తక్కువ సంఖ్యలో దుకాణాలు దక్కాయి. కొంతమంది నేతలకూ ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ నేపథ్యంలో దుకాణాలు దక్కించుకున్న కొత్తవారితో మంతనాలు జరుపుతున్నారు. కొంత వాటా ఇవ్వాలని, తామే వ్యాపారం చేసిపెడతామని లాబీయింగ్ చేస్తున్నట్లు తెలిసింది. కొన్నిచోట్ల ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని స్థానికుల్ని వ్యాపార భాగస్వాములుగా చేర్చుకుంటే అన్నివిధాలుగా అండగా ఉంటారని సూచిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వైద్యులు, ఇతర వృత్తి నిపుణులపై ఈ ఒత్తిడి ఎక్కువగా ఉంది. దుకాణాలు దక్కించుకున్న ఇతర రాష్ట్రాల వారినీ వాటాలు కోరుతున్నారు.

వ్యాపారుల చేతికి లైసెన్సులు

జిల్లాల వారీగా దుకాణాలు

జిల్లా	దుకాణాలు
గుంటూరు	127
పల్నాడు	129
బాపట్ల	117
మొత్తం	373

డిపోల వద్ద రద్దీ లేకుండా

కొత్త దుకాణాలకు బుధవారం ఉదయం నుంచి డిపోల్లో మద్యం ఇస్తారు. తొలిరోజు కావడంతో ఎక్కువ రద్దీకి అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతో తగిన స్థాయిలో నిల్వలు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని గుంటూరు, తెనాలి, నరసరావుపేట డిపోల అధికారులకు ఎక్సైజ్ ఉన్నతాధికారులు సూచించారు. ఈ మేరకు మంగళవారం వారితో సమావేశమయ్యారు. చలానాలు తీసుకెళ్లిన వారికే డిపోల్లో మద్యం అందిస్తారు. మంగళవారం రాత్రి 9 గంటలతో ప్రభుత్వ దుకాణాలకు తెరపడుతుంది. అప్పటికి ఏమైనా నిల్వలుంటే వాటిని డిపోల్లో అప్పగించాలని అధికారులు ఆదేశించారు.

అభ్యంతరాలున్న చోట...

గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాలను జనావాసాలున్నచోట ఏర్పాటు చేశారని, ఇప్పుడక్కడ కొనసాగించొద్దంటూ మేడికొండూరు, మంగళగిరి ప్రాంతాల నుంచి అధికారులకు విజ్ఞాపనలు అందాయి. ప్రజాప్రతినిధులు సైతం ఈ విషయాన్ని తెలియజేశారని, సంబంధిత సర్కిల్ సీఐలకు చెప్పి ప్రజల అభ్యంతరాలేమిటో తెలుసుకోవాలని చెప్పామని ఎక్సైజ్ ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి. ప్రజలకు ఇబ్బందిగా ఉంటే అక్కడ దుకాణాల ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నాయి.

సామగ్రి మాకివ్వండి కొంటాం

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉన్న ఫ్రిజ్‌లు, స్కానర్లు, ఫేక్ కరెన్సీని గుర్తించే టెస్టర్ యంత్రాలు, కుర్చీలు, బల్లలు, ఫ్యాన్లను కొనుగోలు చేస్తామంటూ కొత్త దుకాణదారులు ముందుకొస్తున్నారు. ఆ సామగ్రిని డిపో లేదా గోదాములో నిల్వ చేయాలన్న ఆదేశాలున్నాయి తప్ప విక్రయించాలని ఉత్తర్వులు రాలేదని అధికారులు చెబుతున్నారు.

రైల్వే ట్రాక్ పునరుద్ధరణ
పనులు వేగవంతం



అప్పికట్ల- మాచవరం మధ్య రైల్వే ట్రాక్‌పై మరమ్మతులు



కుంగిన ట్రాక్

పొన్నూరు, న్యూస్‌టుడే: చెన్నై - విజయవాడ మార్గంలో బాపట్ల మండలం అప్పికట్ల రైల్వే స్టేషన్ నుంచి పొన్నూరు మండల పరిధి మాచవరం రైల్వే స్టేషన్ మధ్యలో కుంగిపోయిన రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేశారు. మంగళవారం ఆ శాఖ ఉన్నతాధికారులు ట్రాక్‌ను పరిశీలించారు. కుంగిన ప్రాంతానికి ఒకవైపు ట్రాక్‌కు పటిష్ఠం చేయడానికి 6 జేసీబీలతో పనులు చేస్తున్నారు. దాదాపు 150 మంది సిబ్బంది ఇందులో నిమగ్నమయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాక్‌పై నుంచి ప్రస్తుతం రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి.

పొన్నూరులో 7 సెం.మీ వర్షపాతం

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు 24.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పొన్నూరు మండలంలో 7.1 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కాకుమాను మండలంలో 4, పెదనందిపాడు మండలంలో 4, దుగ్గిరాల మండలంలో 3.9, ప్రత్తిపాడు మండలంలో 3.7 చేబ్రోలు మండలంలో 3.5, వట్టిచెరుకూరు మండలంలో 3.1, కొల్లిపరలో 2.3 గుంటూరు తూర్పులో 2.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదుకాగా తెనాలి, ఫిరంగిపురం, గుంటూరు పశ్చిమ, పెదకాకాని, మేడికొండూరు, తాడేపల్లి, తుళ్లూరు మంగళగిరి, తాడికొండ ప్రాంతాల్లో మోస్తరు జల్లులు పడ్డాయి.

ఈనాడు, అమరావతి



4 రీచ్‌లు... 2.92 లక్షల టన్నులు

ఇసుక తవ్వకానికి అనుమతులు

జిల్లాలో నాలుగు రీచ్‌లలో ఇసుక తవ్వకానికి అనుమతులొచ్చాయి. బుధవారం నుంచే తవ్వకాలు మొదలవ్వాల్సి ఉన్నా.. కృష్ణా నదిలో నీటిప్రవాహం అధికంగా ఉన్నందున సాధ్యం కాలేదు. నాలుగు రీచ్‌లూ 5 హెక్టార్లలోపు విస్తీర్ణంలో ఉండడంతో మనుషుల చేతే తవ్విస్తామని కలెక్టరు నాగలక్ష్మి చెప్పారు. జిల్లాలో అవసరాలను తీర్చేలా ఇసుక లభ్యత ఉన్న ప్రాంతాలను గుర్తించాలని యంత్రాంగానికి సూచించామన్నారు. 5 హెక్టార్ల కంటే అధిక విస్తీర్ణంలో ఇసుక లభ్యత ఉంటే యంత్రాల ద్వారా తవ్వేందుకు వెసులుబాటు ఉంటుంది. అప్పటివరకు ఎంపిక చేసిన గుత్తేదారుల ద్వారా కూలీలతో తవ్వించి సరఫరా చేస్తామని వివరించారు. నదిలో నీటి ప్రవాహం తగ్గగానే తవ్వకాలు ప్రారంభిస్తారని వెల్లడించారు.

- ❖ నాలుగు రీచ్‌ల పరిధిలో 2.92 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉన్నట్టు గుర్తించారు.
- ❖ ఒక్కో రీచ్‌లో రోజుకు వెయ్యి టన్నుల చొప్పున తవ్వి ట్రాక్టర్ల ద్వారా నిల్వ కేంద్రాలకు తరలిస్తారు. అంటే రోజుకు నాలుగు వేల టన్నులు అందుబాటులో ఉంటుంది.
- ❖ ఇప్పటివరకు తాళ్లాయపాలెం డంపింగ్‌యార్డు నుంచి ఇసుక సరఫరా చేశారు. ఇక్కడ నిల్వలు పూర్తి కావడంతో నదిలోంచి తవ్వి తీస్తేనే అందుబాటులోకి వస్తుంది. కృష్ణా నది పరివాహక ప్రాంతంలో వర్షాలు పడుతున్నందున మరో వారం రోజుల వరకు తవ్వకాలకు అవకాశం లేనట్టే.



లాటరీ తీసి ఇసుక రీచ్‌కు ఎంపికైన వివరాలను ప్రకటిస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ

లాటరీ విధానంలో కేటాయింపు

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: నాలుగు రీచ్‌ల కోసం మంగళవారం సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. మొత్తం 51 మంది టెండర్లను దాఖలు చేయగా 17 టెండర్లు అర్హత సాధించాయి. అత్యధికంగా బొమ్మువానిపాలెం-15 రీచ్‌కు 14 మంది పోటీ పడ్డారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరనే గుత్తేదారులు కోట్ చేయడంతో లాటరీ తీసి రీచ్‌లను కేటాయించారు. మున్నంగి, గుండిమెడ రీచ్‌లను ఒకే గుత్తేదారు దక్కించుకోగా, బొమ్మువానిపాలెం 14, 15 రీచ్‌లు వేర్వేరు సంస్థలకు దక్కాయి. కార్యక్రమంలో భూగర్భ, గనుల శాఖ ఉప సంచాలకులు వెంకటసాయి, ఆర్‌డబ్ల్యుఎస్, రవాణా, ఆడిట్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రూ. 110లకే టెండరు

రీచ్‌ల నుంచి కూలీల ద్వారా ఇసుక తవ్వి అక్కడి నుంచి స్టాక్ యార్డుకు తరలించడం, అనంతరం కొనుగోలుదారుల వాహనాల్లో లోడ్ చేసేందుకు ప్రభుత్వం టన్ను ధర రూ.110గా నిర్ణయించింది. గుత్తేదారులందరూ ఇదే ధరను కోట్ చేయడం గమనార్హం. దీంతో లాటరీ ద్వారా ఎంపిక చేయాల్సి వచ్చింది.



కుప్పకూలిన వార్డు సచివాలయ సీలింగ్

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి చినరావూరు 13వ వార్డు సచివాలయం భవన సీలింగ్ మంగళవారం కుప్పకూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తాము విధుల్లో ఉన్న సమయంలో పడి ఉంటే మా పరిస్థితి ఏమిటని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెనాలి చినరావూరులో వివాహాది కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి రూ. 25 లక్షల వ్యయంతో సామాజిక భవనం నిర్మించారు. ఇది సరిపోకపోవడంతో ఆ భవనం పైన రూ.10 లక్షలతో రేకుల షెడ్డు నిర్మించి సీలింగ్ ఏర్పాటు చేశారు. ఇందులోకి గత వైకాపా ప్రభుత్వ హయాంలో 13వ వార్డు సచివాలయాన్ని మార్చారు. సచివాలయ ఉద్యోగులు మంగళవారం ఉదయం షెడ్డు తాళం తీసి చూసే సరికే సీలింగ్ కూలి టేబుళ్లు, గచ్చుపై పడి ఉంది. పంకాల రెక్కలు వంగి పోయాయి. తరువాత కమిషనర్ బండి శేషన్న వ్యర్థాలను తొలగింప చేశారు.



దారంతా గుంతలే....



పెద్దపెద్ద గుంతలతో రహదారి

ఐదేళ్ల నరకం



సగంలో నిలిచిపోయిన చుట్టుగుంట పలకలూరు రహదారి నిర్మాణం

ఇది గుంటూరు నగరం నుంచి జాతీయరహదారి వైపు వెళ్లే పలకలూరి రహదారి. ఓ వైపు భారీ గుంతలతో వాహనాలపై వెళ్లే నడుం విరిగిపోయేలా జనానికి ఐదేళ్లుగా నరకం చూపిస్తోంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో గుత్తేదారుకు బిల్లులు చెల్లించకపోవడంతో అసంపూర్తిగా నిలిపేశారు. ప్రస్తుతం గోతులన్నీ పెద్దవిగా మారాయి. అడుగు తీసి వేయలేనంతగా పెరిగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారి పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- ఈనాడు గుంటూరు.

విజిలెన్స్‌కు జీఎంసీ ప్రణాళిక విభాగం సహాయ నిరాకరణ

ఇంతవరకు గ్రీన్‌గ్రేస్ భవనాల దస్త్రాలివ్వని వైనం

ఈనాడు, అమరావతి: గుంటూరు నగరంలో వైకాపా నాయకుడు అంబటి మురళీకృష్ణకు చెందిన గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ నిర్మాణాలకు మంజూరు చేసిన అనుమతులు, ప్లాను నకళ్లను విచారణ నిమిత్తం జిల్లా విజిలెన్స్ విభాగానికి ఇచ్చేందుకు జీఎంసీ ప్రణాళిక విభాగం ససేమిరా అంటోంది. విజిలెన్స్ విభాగం లేఖ రాసి పది రోజులు గడిచినా ఇప్పటిదాకా స్పందించలేదు. రికార్డులు ఎందుకివ్వడం లేదో విజిలెన్స్ ఆరా తీస్తోంది. ఈ విభాగం నుంచి లేఖ అందిన రోజే కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రణాళిక విభాగాన్ని అప్రమత్తం చేశారు. విజిలెన్స్ లేఖను కూడా పంపించారు. తరువాత ఆయన అధికారిక పర్యటన నిమిత్తం వారం రోజులపాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లారు. అక్కడికి బయలుదేరే ముందు కూడా ప్రణాళిక అధికారులతో గ్రీన్‌గ్రేస్ నిర్మాణాలపై సమీక్ష చేశారు. రైల్వే అధికారులతో చేసిన పరిశీలనలో గుర్తించిన లోపాలను విజిలెన్స్ విభాగానికి తెలియజేయాలని కూడా సూచించారు. అయినా.. ఇంతవరకు ప్రణాళిక విభాగం స్పందించనే లేదు. సంబంధిత నిర్మాణాలకు పూర్తిస్థాయిలో అనుమతుల్లేవని, ప్రణాళిక విభాగ అధికారులు ఏనాడూ అడ్డుకోలేదని అందుకు బాధ్యులైన పదిమందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల కమిషనర్ ప్రణాళిక విభాగం రాష్ట్ర సంచాలకుడికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి రికార్డులు విజిలెన్స్‌కు అప్పగిస్తే మరిన్ని లోపాలు, అక్రమాలు బయటపడతాయన్న భయంతోనే వాటిని అప్పగించకుండా జాప్యం చేస్తున్నట్టు తెలుస్తోంది.

హామీలు నెరవేరుస్తున్న పెమ్మసాని


చంద్రశేఖర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆళ్ల హరి తదితరులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నెరవేరుస్తున్నారని జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి పేర్కొన్నారు. శంకరవిలాస్ బ్రిడ్జి విస్తరణ, అభివృద్ధికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రూ.98 కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. శ్రీనివాసరావుతోటలో పెమ్మసాని చంద్రశేఖర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. హరి మాట్లాడుతూ పెమ్మసాని ఈ ప్రాంత ప్రజలు పడుతున్న బాధలను కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లి త్వరితగతిన నిధులు మంజూరయ్యేలా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు ధరణి, రవీంద్ర, బాష, శేఖర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం మాయం కేసులో ఎస్సై సస్పెన్షన్

వెంకటాచలం: వెంకటాచలం పోలీసు స్టేషన్‌లో దాచి ఉంచిన బంగారు ఆభరణాలు మాయమైన ఘటనలో నాడు ఎస్సైగా పనిచేసిన కరీముల్లాపై సస్పెన్షన్ వేటు పడింది. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేసు వివరాల్లోకి వెళితే.. 2019లో వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం పట్టుబడింది. ఆ సమయంలో తరలింపుదారుల వద్ద ఉన్న బంగారు ఆభరణాలు (సుమారు 750 గ్రాములు) కూడా పోలీసులు స్వాధీనం చేసుకుని.. వాటిని స్టేషన్‌లో ఉంచారు. కేసు నమోదు సమయంలో ఎఫ్ఐఆర్‌లోనూ బంగారం సీజ్ చేసిన విషయం పొందుపరిచారు. ఆభరణాలు స్టేషన్‌లోని బీరువాలో భద్రపరిచారు. గత ఏడాది ఎర్రచందనం కేసు విచారణ చివరి దశకు రావడంతో.. సీజ్ చేసిన ఆభరణాలపై ఆరా తీశారు. అవి కనిపించకపోవడంతో.. అప్పట్లో ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. విచారణ జరిపిన అధికారులు కరీముల్లా ఎస్సైగా పని చేసిన సమయంలోనే మాయమైనట్లు గుర్తించి, నివేదిక ఇచ్చారు. అయినా అప్పట్లో ఎలాంటి చర్య తీసుకోలేదు. ప్రస్తుతం బంగారం మాయంపై తిరిగి విచారణ జరిపి కరీముల్లాపై చర్యలు తీసుకున్నారు.

వివాదాస్పదుడిగా... వైకాపా ప్రభుత్వ హయాంలో వెంకటాచలం, పొదలకూరుల్లో పనిచేసిన కరీముల్లా వివాదాస్పద ఎస్సైగా పేరు తెచ్చుకున్నారు. వైకాపా నాయకులు చెప్పినట్లు ఏకపక్షంగా పనిచేశారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. వెంకటాచలం మండలంలో ఇద్దరు ముస్లిం యువకుల మృతి, పొదలకూరులో దళిత వ్యక్తి ఉదయగిరి నారాయణ మృతికి కరీముల్లానే కారణమనే ఆరోపణలు ఉన్నాయి. బంగారం మాయంతోపాటు ఆరోపణలు, విచారణ తదితరాలతో ఈ ఏడాది జనవరిలో దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. ప్రస్తుతం తెనాలి ఎస్సైగా పని చేస్తున్నారు.

నీటి బొట్టు.. భావితరాలకు అందేట్టు..

జల సంరక్షణలో కేఎల్‌యూ ఆదర్శం

తాడేపల్లి, న్యూస్‌టుడే

సకల జీవుల మనుగడకు నీరు ప్రధాన ఆధారం. సహజ వనరుల కాలుష్యం, అడవుల నరికివేత, గ్లోబల్ వార్మింగ్ తదితర కారణాలతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఈ నేపథ్యంలో విలువైన తాగునీటిని సంరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆ స్ఫూర్తిని అందిపుచ్చుకుని తాడేపల్లి మండలం వడ్డేశ్వరం వద్ద ఉన్న వర్సిటీ ప్రాంగణంలో వర్షపు నీటిని వడిసిపట్టి జల సంరక్షణలో తమదైన ప్రత్యేకత చాటుకుంటోంది. ఈ కృషికి పురస్కారాలు కూడా వర్సిటీని వరించాయి.

28 ఇంకుడు గుంతలు..

భవనాలపై పడిన వర్షపు నీటిని సంరక్షించేందుకు వర్సిటీ ప్రాంగణంలో 28 ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు.



వర్సిటీ ఆవరణలో ఇంకుడు గుంత

ఒక్కోటి 10 అడుగుల లోతు, మూడు అడుగుల వెడల్పున తయారు చేశారు. ఒక్కో గుంత 3.50 లక్షల లీటర్ల భూమిలోకి ఇంకిపోయేటట్లు చేస్తుంది. దీంతో భూగర్భ జలాలు పెరుగుతాయి. ఎండిపోయే బోర్లకు రీఫిల్టరింగ్ విధానం అమలు చేస్తారు. ఇలాంటివి మొత్తం పది ఉన్నాయి. వర్షపునీరు రీఫిల్టరింగ్ ద్వారా బోర్లలోకి పంపుతారు. దీంతోపాటు అక్కడక్కడ మూడు లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి కమతాలు (కుంటలు) ఏర్పాటు చేశారు.


ఇటీవల దిల్లీలో పురస్కారం అందుకుంటున్న ప్లానింగ్, డెవలప్‌మెంట్ డీన్ రాజేష్

సాంకేతికతతో వృథాకు అడ్డుకట్ట..

విశ్వవిద్యాలయ ఆవరణలో నీటి వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకున్నారు. కొళాయిలకు స్మార్ట్ వాటర్ మీటర్లు ఏర్పాటు చేశారు. దీని ద్వారా రోజువారీ నీటి వినియోగం, వృథాను లెక్కగడతారు. ఇందుకోసం 600 మీటర్లు అమర్చారు. ఆ సమాచార సేకరణకు ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఇక్కడ 160 మరుగుదొడ్లలో సెన్సార్ యూరినల్స్ 550 ఏర్పాటు చేశారు. బటన్ నొక్కడం ద్వారా లీటరు నీరు వృథాగా పోతుంది. సెన్సార్ ద్వారా వంద నుంచి రెండు వందల ఎంఎల్ వరకు మాత్రమే వినియోగిస్తారు. సాధారణంగా రోజూ ఇక్కడ ఉన్న 20 వేల మంది విద్యార్థులకు 40 వేల లీటర్లు కావాల్సి ఉండగా.. సెన్సార్ విధానంతో కేవలం 4 వేల లీటర్లు మాత్రమే సరిపోతున్నాయి. విశ్వవిద్యాలయంలో ఐదు మురుగునీటి శుద్ధి కేంద్రాలను 'ఎయిర్ బిట్' అనే ఆధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేశారు.

మూడేళ్లుగా పురస్కారాలు..

జలసంరక్షణకు గాను కేంద్ర ప్రభుత్వం నుంచి కేఎల్‌యూకు మూడేళ్లుగా పురస్కారాలు లభిస్తున్నాయి. 2024లో దిల్లీకి చెందిన 'ఎనర్జీ అండ్ రిసోర్స్, యునైటెడ్ నేషనల్ ఫర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' సంయుక్తంగా దేశవ్యాప్తంగా ప్రథమ బహుమతి అందించింది. 2023లో 'వాటర్ డైజెస్ట్ యునెస్కో కోఆర్డినేషన్-మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి', 2022లో 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ' నుంచి పురస్కారాలు అందించాయని విశ్వవిద్యాలయం ప్లానీ, డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ రాజేష్, వాటర్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ డీన్ బ్రహ్మాచారి తెలిపారు.

నవంబరులో శృంగేరీ జగద్గురువుల రాక


డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిసిన శృంగేరీ పీఠం ప్రతినిధులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శృంగేరీ శారదా పీఠం ప్రతినిధులు మంగళవారం డీజీపీ ద్వారకా తిరుమలరావును ఆయన కార్యాలయంలో కలిశారు. శృంగేరీ పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి నవంబరు నెలలో చేపట్టిన విజయయాత్ర గురించి డీజీపీకి వివరించారు, స్వామియాత్రలో పాల్గొని ఆశీస్సులు పొందాల్సిందిగా ఆయనను ఆహ్వానించారు. డీజీపీని కలిసిన వారిలో గుంటూరుకు చెందిన హోమియోపతి వైద్యుడు ఓవీ రమణ తదితరులున్నారు. స్వామి నవంబరు 18 నుంచి 20 వరకు విజయవాడ సత్యనారాయణపురంలోని శ్రీశృంగేరీ పీఠ పరిపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో బస చేస్తారు. 21 నుంచి 24 వరకు గుంటూరు శ్రీశృంగేరీ పీఠంలో బస చేస్తారని, పలు కార్యక్రమాల్లో పాల్గొని అనుగ్రహభాషణలు చేస్తారని ప్రతినిధులు తెలిపారు.

నేటి నుంచి నాటకోత్సవాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి, అభినయ థియేటర్ ట్రస్టు, గుంటూరు ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు, యశోద ఫౌండేషన్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నుంచి గుంటూరులో నారా చంద్రబాబునాయుడు నాటకోత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకుడు అభినయ శ్రీనివాస్ తెలిపారు. గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞానమందిరంలో సాయంత్రం ఆరు గంటలకు పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్సవాలను ప్రారంభిస్తారు. నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీనివాస్, భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పీఆర్ రాజు, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాసరావు తదితర ప్రముఖులు పాల్గొంటారు. సభానంతరం శ్రీకాకుళం జిల్లా శర్వాణీ గ్రామీణ గిరిజన సాంస్కృతిక సంఘం బొరివంక కళాకారులు కొత్త పరిమళం నాటికను, రాత్రి 8 గంటలకు కె.జె.ఆర్. కల్చరల్ అసోసియేషన్ సికింద్రాబాద్ వారు సాహితీ సూక్తం నాటికను ప్రదర్శిస్తారు. ఇదే తీరులో మిగిలిన రెండు రోజులు కూడా సభలు, నాటక ప్రదర్శనలు ఉంటాయని ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా స్టెప్ ఇన్‌ఛార్జి సీఈవోగా విజయలక్ష్మి

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా యువజన సేవలు- స్టెప్ ఇన్‌ఛార్జి సీఈవోగా టి.వి.విజయలక్ష్మిని నియమిస్తూ జిల్లా కలెక్టరు ఎస్.నాగలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ఇటీవలే డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరుగా బాధ్యతలు స్వీకరించారు. స్టెప్ సీఈవో పోస్టు ఖాళీగా ఉండడంతో ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఆరోగ్య కార్యకర్తలకు ఉద్యోగోన్నతి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య శాఖలో ఆరోగ్య కార్యకర్త(మహిళ)లుగా పనిచేస్తూ జీఎన్ఎం శిక్షణ పూర్తయిన వారికి స్టాఫ్‌నర్సులుగా ఉద్యోగోన్నతిస్తూ ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు సుచిత్ర మంగళవారం ఆదేశాలిచ్చారు. మొత్తం 8 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి వారు ఎంపిక చేసుకున్న ఆసుపత్రికి బదిలీ చేశారు.

17 నుంచి దూరవిద్యా పరీక్షలు


సమావేశంలో రిజిస్ట్రార్ సింహాచలం, ఇతర అధికారులు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్యాకేంద్రంలో ఈనెల 17 నుంచి యూజీ, పీజీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో రిజిస్ట్రార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని సూచించారు. గతంలో మాదిరిగా అక్రమాలు జరిగితే ఉపేక్షించబోమని చెప్పారు. సీడీఈ సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో సూపరింటెండెంట్లు కీలకమన్నారు. 10 సైన్స్ కోర్సుల నిర్వహణకు అనుమతి వచ్చిందని, త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని సంచాలకులు తెలిపారు. పరీక్షల సమన్వయకర్త డాక్టర్ రామచంద్రన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 114 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒక్కో కేంద్రంలో పరిశీలకులు, ప్రాంతీయ సమన్వయకర్త, ప్రత్యేక స్క్వాడ్ బృందాలను ఏర్పాటుచేశామన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ రిజిస్ట్రార్ కృష్ణవేణి, అకడమిక్ కౌన్సెలర్ శ్రీహరి పాల్గొన్నారు.

జడ్పీ రికార్డుల పరిశీలన



జిల్లాపరిషత్తు(గుంటూరు): రాష్ట్ర 5వ ఆర్థిక సంఘం సభ్యులు ఆచార్య ఎం.ప్రసాదరావు, ఆచార్య ఎంవీఎస్ పద్మారావు, కె.కృపారావు, తాఖుద్దీన్ జిల్లాపరిషత్తు కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. వార్షిక బడ్జెట్, నిధుల వినియోగం, ఇ-గ్రామ స్వరాజ్ పోర్టల్, ఆడిట్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించగా..సీఈవో జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ వివరాలు తెలిపారు. అనంతరం సీఈవో ఛాంబర్‌లో సమావేశం నిర్వహించి జడ్పీ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జడ్పీ విభాగాల ఏవోలు రామకోటయ్య, శోభారాణి, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యుత్తు ఛార్జీల పెంపు ప్రతిపాదన సరికాదు'

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: విద్యుత్తు ఛార్జీల పెంపు ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఈ నెల 18న సబ్‌స్టేషన్ల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఒక ప్రకటనలో కోరారు. ఒకపక్క నిత్యావసర సరకుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతుంటే.. మరోపక్క విద్యుత్తు ఛార్జీలు పెంచాలని ప్రతిపాదనలు చేయడం సరికాదని, వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

శరీర దానంపై అవగాహన

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి ఎయిమ్స్ శరీర నిర్మాణ శాస్త్ర విభాగం ఆధ్వర్యాన మంగళవారం వైద్య విద్యార్థులు, వైద్యులు శరీరదానం ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీన్ని సీఈవో డాక్టర్ మాధబానందకర్, డీన్ డాక్టర్ శ్రీమంత్ కుమార్‌దాస్ ప్రారంభించారు. శరీర నిర్మాణ శాస్త్రవేత్త, వైద్యుడు ఆండ్రియాస్ వెసోలియస్ వర్ధంతిని ఏటా ప్రపంచ అనాటమీ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వైద్యులు వంశీకృష్ణారెడ్డి, పీకే శంకరన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.



ప్రదర్శనలో వైద్య విద్యార్థులు

సాదియా అల్మాస్‌కు ఘన స్వాగతం



గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: సౌత్ ఆఫ్రికాలో జరిగిన కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన షేక్ సాదియా అల్మాస్ నాలుగు బంగారు పతకాలు సాధించింది. హైదరాబాద్ మీదుగా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న షేక్ సాదియా అల్మాస్‌కు పలువురు క్రీడాభిమానులు, కుటుంబ సభ్యులు, పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఘన స్వాగతం పలికారు. జూనియర్ 57 కిలోల విభాగంతో పాటు ఓవరాల్‌గా నాలుగు బంగారు పతకాలను సాదియాఅల్మాస్ సాధించినట్లు కోచ్ షేక్ సంధాని తెలిపారు. బంగారు పతకం రావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, తనకు సహకరించిన మంత్రి నారా లోకేశ్, అసోసియేషన్ ప్రతినిధులు, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపిన అల్మాస్.. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధిస్తానని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణ లక్ష్యాలు అధిగమించాలి: కలెక్టర్

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలోని హౌసింగ్ లేఔట్లలో ఇళ్ల నిర్మాణాలు ప్రతివారం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి మంగళవారం హౌసింగ్ లేఔట్లలో ఇళ్ల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ లేఔట్లలో ఆశించిన స్థాయిలో ఇళ్ల నిర్మాణం జరగడం లేదని, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణ సంస్థ ఏఈలను సమన్వయం చేసుకుని సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎమినిటీస్ సెక్రటరీల ద్వారా రోజూ పర్యవేక్షించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇనుము అందుబాటులో ఉందని, ఇసుక సైతం సంబంధిత లేఔట్‌లో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూఫ్ లెవల్‌లో ఉన్న ఇళ్లను లబ్ధిదారులు తక్షణమే పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నిర్దేశిత లక్ష్యాలను అధిగమించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరు చేసిన కిచెన్‌గార్డెన్లు, మరుగుదొడ్ల మరమ్మతులు, మంచినీటి సౌకర్యం తదితర పనులను సంబంధిత ఇంజినీరింగ్ శాఖల ద్వారా వెంటనే ప్రారంభించేలా ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, సీపీవో శేషశ్రీ, హౌసింగ్ పీడీ జీవీఎస్ఆర్ కేవీ ప్రసాద్, డ్వామా పీడీ శంకర్, మహిళాభివృద్ధి సంస్థ పీడీ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, రిటైల్ ధర - 157, చికెన్ విత్‌స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

స్నేహితురాలిని కలిసేందుకు వెళుతూ మృత్యువాత


మృతి చెందిన పర్వీన్

బోయపాలెం(ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: స్నేహితురాలిని కలిసి వస్తానని చెప్పి ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లిన కుమార్తె...గంటల వ్యవధిలోనే మృతి చెందిన వార్త విని కన్నపేగు తల్లడిల్లిపోయింది. నిర్జీవంగా రోడ్డుపై పడిన కుమార్తెను చూసి తల్లిదండ్రులు, బంధువులు గుండెలు పగిలేలా రోదించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..గుంటూరు నగరంలోని అరుంధతి నగర్‌కు చెందిన మహమ్మద్ అప్స జబీన్, రజాక్ దంపతుల కుమార్తె పర్వీన్(16) మంగళవారం మధ్యాహ్నం స్నేహితురాలిని కలిసి వస్తానని తల్లితో చెప్పి ఇంటి నుంచి స్కూటీపై బయలుదేరి వెళ్లింది. ఈ క్రమంలో ప్రత్తిపాడు మండలం బోయపాలెం వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కారు చోదకుడు అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న పర్వీన్ బండిని అదుపు చేయలేక ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందింది. అదే సమయంలో తల్లి.. కుమార్తెకు ఫోన్ చేయగా..ఎవరో గుర్తు తెలియని వ్యక్తి తీసి మీ అమ్మాయి రోడ్డు ప్రమాదంలో చనిపోయిందని చెప్పడంతో ఆమె కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఘటనా స్థలికి బయలుదేరారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగేంద్ర చెప్పారు.

కలాం సేవలు ఎనలేనివి: లోకేశ్

తాడేపల్లి: విద్య, విజ్ఞాన, శాస్త్ర, సాంకేతిక రంగాలకు మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం ఎనలేని సేవలందించారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కలాం జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దేశం కోసం జీవితాంతం శ్రమించిన ఆయన్ను నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు.

35 వేలకు పైగా మిర్చి బస్తాల విక్రయం

మిర్చియార్డు, న్యూస్‌టుడే: మిర్చియార్డులో 35 వేలకు పైగా బస్తాల విక్రయాలు జరిగాయి. రైతులు మంగళవారం 38,191 బస్తాలు యార్డుకు తరలించారు. అందులో 35,674 బస్తాలు విక్రయాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 23,325 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8000-16500, నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.9000-18500, తాలు మిర్చికి రూ.5000-11500, ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ. 8500-16000, ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ. 9200-18300, తాలు మిర్చికి రూ.5000-10500 ధర లభించింది.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు



దేవతామూర్తుల వేషధారణలో కళాకారుల ప్రదర్శన

వైభవంగా వాసవీ ఉత్సవాలు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి దుగ్గిరాలలో నిర్వహించిన గ్రామ ప్రదర్శన ఆకట్టుకుంది. పార్వతీపరమేశ్వరులు, వినాయకుని వేషధారణలో చేసిన నృత్యాలు అందరి మన్నన పొందాయి. ఆర్యవైశ్య సంఘాల నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

సమస్య: గుండ్లపాలెం అడ్డ రోడ్డు గుంతలమయంగా మారింది. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. **- సాయి హర్షిత్, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి మరమ్మతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం.
- పూర్ణశంకరరావు, ఈవోపీఆర్డీ

సమస్య: తాడికొండ గ్రామంలోని బండ్ల బజారుకు సమీపంలో ప్రధాన మురుగుకాలువ పూడిక తీయలేదు. దుర్వాసన భరించలేకున్నాం. **- సుధాకర్, గ్రామస్థుడు**

సమాధానం: ఎప్పటికప్పుడు కాలువలో పూడిక తీయిస్తాం.
- హరిబాబు, పంచాయతీ కార్యదర్శి

– మేడికొండూరు, తాడికొండ, న్యూస్‌టుడే

ఇసుక చోరీపై కేసు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాయపూడి సమీపంలోని ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద ఎన్‌సీసీ గుత్తేదారు సంస్థ కొంత ఇసుకను నిల్వ చేసింది. అక్కడ ఉన్న ఇసుకను మంగళవారం సాయంత్రం పల్నాడు జిల్లా లింగాపురం గ్రామానికి చెందిన వ్యక్తి నాలుగు చక్రాల ఆటోలో అక్రమంగా తరలించుకు పోతున్న సమయంలో కంపెనీ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ ఘటనపై ఎన్‌సీసీ ఎన్‌సీసీ అసిస్టెంట్ స్టోర్ మేనేజర్ రామాంజనేయులు ఫిర్యాదు మేరకు సీఐ గంగా వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు.

మంత్రి లోకేశ్ సహకారంతో రాత పుస్తకాలు

తాడేపల్లి: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో తాడేపల్లిలోని మండల పరిషత్ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఉచితంగా రాత పుస్తకాలు పంపిణీ చేశారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి దారా దాసు తదితరులు 540 పుస్తకాలను 180 మంది విద్యార్థులకు అందజేశారు. నాయకులు మురళీ, శ్రీను, నాగేశ్వరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: భోజనానికి ముందు తప్పకుండా ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రం చేసుకోవాలని, దీని వల్ల వ్యాధులు దరిచేరవని ఎంపీడీవో కె.శివపార్వతి అన్నారు. అంతర్జాతీయ చేతులు పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్తిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు అవగాహన పెంచుకుని తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఈవోపీఆర్డీ జి.రవికుమార్, స్వచ్ఛభారత్ మిషన్ మండల సమన్వయకర్త డి.శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి కార్యదర్శి షేక్ బాజా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో కె.శివపార్వతి, ఈవోపీఆర్డీ జి.రవికుమార్, సిబ్బంది

దుగ్గిరాల, న్యూస్‌టుడే: పరిశుభ్రమైన చేతుల్లోనే ఆరోగ్యం ఉందని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ చేతుల పరిశుభ్రతా దినోత్సవాన్ని పాటించారు. దీనిపై బాలురకు అవగాహన ఏర్పరిచారు. ఎంఈవో-2 కాజ లక్ష్మీనారాయణ, టీచర్లు, స్వచ్ఛ భారత మిషన్ మండల సమన్వయకర్త ఉన్నం రాజేష్ ఉన్నారు.

పల్లెలకు పండగొచ్చింది!

రూ.కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం

మేడికొండూరు, ఫిరంగిపురం గ్రామీణం, ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. కొద్ది రోజుల కిందట గ్రామ సభలు నిర్వహించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఇందులో భాగంగా 'పల్లె పండగ' (పంచాయతీ వారోత్సవాలు) కార్యక్రమం చేపట్టింది. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14 సోమవారం నుంచి 20 వ తేదీ వరకు వారం రోజుల పాటు కార్యక్రమం జరగనుంది. ఇందులో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేస్తున్నారు. ప్రధానంగా అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు, ఇంటింటికీ కుళాయి పనులు, గ్రామాల అనుసంధానం చేసే దారులు, ప్రభుత్వ భవనాలు తదితరాల పనులు చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా జాతీయ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ఆధ్వర్యంలో ఆయా పనులు జరగనున్నాయి. సంక్రాంతి కల్లా వీటిని పూర్తి చేయాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నారు.

వివరాలిలా.. మండలం	ఎంపిక చేసిన (గ్రామాలు)	కేటాయించిన నిధులు (రూ.లక్షల్లో)
ఫిరంగిపురం	05	75
మేడికొండూరు	07	75
తాడికొండ	08	75
తుళ్లూరు	01	25
గ్రామీణ గుంటూరు	9	60
ప్రత్తిపాడు	5	60
వట్టిచెరుకూరు	6	60
పెదనందిపాడు	8	60
కాకుమాను	6	60

పరిష్కారానికి నోచుకోక... గత వైకాపా పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. గత ఐదేళ్లు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎక్కడ సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. ఏళ్లుగా కనీసం మౌలిక సదుపాయాలు, ఉన్న వాటిని ఆధునికీకరించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయంతో జనాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తుళ్లూరు మండలంలో వడ్డమాను, హరిశ్చంద్రాపురం, పెదపరిమి మూడు మినహా మిగిలిన గ్రామాలు సీఆర్‌డీఏ పరిధిలోకి వెళ్లాయి. దీంతో ఆయా చోట్ల మాత్రమే అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో రూ.3 కోట్ల ఉపాధి నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను తొలి విడతలో చేపట్టారు. పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో 32 పనులు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పరిధిలో రెండు పనులను చేపడుతున్నారు.



మంగళగిరిపాడులో మంగళవారం శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

దేశ భక్తితో మెలగాలి

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని పేరేచర్ల ఇంటెల్ ప్రయివేట్ పాఠశాలలో టెన్ ఆంధ్రా ఎన్‌సీసీ బాలికల యూనిట్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా కమాండింగ్ ఆఫీసర్ వీఎస్.సుదర్శన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశ భక్తి కలిగి ఉండాలని తెలిపారు. రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్(సీనియర్ న్యాయవాది) పోసాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు. తోటివారితో దయాగుణంతో ఉండాలని తెలిపారు. సరిపూడికి చెందిన రిటైర్డు మేజర్(ఎన్‌సీసీ) ఛాపరాల రామ్మోహన్ రావు, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌కు రూ.లక్ష విరాళం

కొమ్మూరు(కాకుమాను): మండలంలోని కొమ్మూరులో వాటర్ ప్లాంట్ నిర్వహణకు పెదనందిపాడుకు చెందిన రావి శివరామకృష్ణయ్య రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సమక్షంలో మంగళవారం గ్రామస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో తాను గ్రామంలో ఉన్నానని, ఆ అనుబంధంతో తాను విరాళం అందిస్తున్నట్లు చెప్పారు. దాతను పలువురు నాయకులు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ

పెదనందిపాడు: రావిపాడు వీఆర్వోగా కె.ప్రసాద్, నాగులపాడు సర్వేయర్‌గా పరిమళ మంగళవారం బాధ్యతలు చేపట్టినట్లు ఉప తహసీల్దార్ యహోషువా తెలిపారు. వీరు చేబ్రోలు మండలం వేజెండ్ల, నూజెండ్ల మండలం ముప్పరాజువారిపాలెం నుంచి ఇక్కడకి బదిలీపై వచ్చారన్నారు.

మహిళల నిరాహార దీక్ష విరమణ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గత అయిదేళ్ల వైకాపా పాలనలో ఆపార్టీ నాయకుల చేసిన అక్రమాలపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరుతూ వికాస్‌నగర్‌లో ఆదర్శ మహిళా మండలి



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేస్తున్న ఎమ్మెల్యే

ఆధ్వర్యంలో మహిళలు చేస్తున్న నిరాహార దీక్షను ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు విరమింపజేశారు. స్వర్ణభారతినగర్‌కు చెందిన కోవూరు శ్రీలక్ష్మి మరో ఇద్దరు మహిళలతో కలిసి వికాస్‌నగర్‌లోని ఇంట్లో మూడు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు వైకాపా నాయకులు పేదల ఇళ్ల స్థలాలను ఆక్రమించి అమ్ముకున్నారని, ఇళ్ల స్థలాలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను పలుమార్లు కోరినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామన్న అక్కసుతో వైకాపా గుండాలు తమపై దాడి చేసినా పోలీసులు, అధికారులు పట్టించుకోలేదు. అందుకే తాము ఈ దీక్ష చేపట్టామని ఎమ్మెల్యే రామాంజనేయులుకు మహిళలు తెలిపారు. దీనికి ఆయన స్పందిస్తూ వైకాపా నాయకులపై కేసులు నమోదు చేయించి అరెస్ట్ చేయిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు దీక్ష విరమించారు.

కలాం జీవితం ఆదర్శనీయం



మంగళగిరి: తెదేపా కార్యాలయంలో నాయకులు..



మేడికొండూరు: ఎన్ఆర్ఐవీటీ కళాశాలలో..



దుగ్గిరాల: బాలికల ఉన్నత పాఠశాలలో..



ప్రత్తిపాడు: చినకొండ్రుపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో..



గుంటూరు రూరల్: విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో..

మంగళగిరి, మేడికొండూరు, ప్రత్తిపాడు, దుగ్గిరాల, గుంటూరు రూరల్, పెదనందిపాడు, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జీవితం స్ఫూర్తిదాయకమని, నేటి తరం ఆయన్ను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు చేరాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కలాం జయంతి కార్యక్రమాలను నియోజకవర్గాల వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, ఉపాధ్యాయులు ఆయన చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు.

'మద్యం పేరుతో వైకాపా దోపిడీ'



కాకుమాను : కొమ్మూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

కొమ్మూరు (కాకుమాను), న్యూస్‌టుడే: గత ఐదేళ్ల వైకాపా పాలనలో మద్యం పాలసీలో బ్యాంకు లావాదేవీలకు ఆస్కారం లేకుండా గత వైకాపా ప్రభుత్వం దోపిడీకి పాల్పడిందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆరోపించారు. దోచుకున్న ఆ డబ్బులు ఎక్కడ ఉన్నాయో, ఏం అయ్యాయో తెలియాల్సి ఉందన్నారు. కాకుమాను మండలం కొమ్మూరులో 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా సీసీ రహదారులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆ నగదుకు సంబంధించి లెక్కలు చెప్పలేదన్నారు. కూటమి ప్రభుత్వం బ్యాంకు లావాదేవీలతో పారదర్శకంగా మద్యం విధానం అమలు చేస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. గ్రామంలో రూ. 15 లక్షలతో సీసీ రహదారులు నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం..

పంచాయతీకి సంబంధించిన నిధులు గోల్ మాల్ చేశారని, ఇష్టానుసారం ఒకరి ఖాతాకు జమ చేశారని ఎమ్మెల్యేకు గ్రామస్థులు పిర్యాదు చేశారు. దీంతో కార్యదర్శిని ఎమ్మెల్యే రామాంజనేయులు పిలిచి మాట్లాడారు. ఐదేళ్ల వైకాపా పాలనలో పంచాయతీకి సంబంధించిన నిధులు, ఖర్చుల వివరాలు మూడు రోజులలోగా నివేదిక తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. అవినీతికి పాల్పడిన వారిని వదిలిపెట్టబోమని, ఇకపై తీరు మార్చుకోవాలని కార్యదర్శిని మందలించారు. డీఏపీ, యూరియా బస్తాలు నల్లబజారులో అధిక ధరలకు విక్రయిస్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు రైతులు ఫిర్యాదు చేయగా.. దీనిపై నివేదిక ఇవ్వాలని ఏవో కిరణ్మయిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకట స్వామి, ఎంపీడీఓ యుగ కీర్తి, డీఈ భానుప్రకాష్, తెదేపా నాయకులు సునీల్ చౌదరి, అగస్టిన్‌బాబు, వీరయ్య చౌదరి, పూర్ణచంద్రరావు, బషీరు, నబి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ షేక్ జబీన్, వైస్ ఎంపీపీ పసుపులేటి సాయిచైతన్య, తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత అన్నారు. మంగళవారం శృంగారపురం, పెదపాలెం, చినపాలెం గ్రామాల్లో సర్పంచులు కొండూరు సుధారాణి, పాటిబండ్ల కృష్ణప్రసాద్, వాసిరెడ్డి ప్రదీప్‌ల అధ్యక్షతన ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాలు జరిగాయి. మూడు గ్రామాల్లో కలిపి రూ.83.86 లక్షల పనులకు శంకుస్థాపన చేశారు.

వైకాపా పాలనలో పడకేసిన ప్రగతి

మేడికొండూరు, న్యూస్‌టుడే: గ్రామాలు అభివృద్ధే ఎన్డీయే కూటమి లక్ష్యమని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లెపండుగ (పంచాయతీ వారోత్సవాలు) కార్యక్రమంలో భాగంగా మంగళవారం మేడికొండూరు, సరిపూడి, తురకపాలెం, మంగళగిరిపాడులో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైకాపా పాలనలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. మేడికొండూరు తాగు నీటి చెరువు వద్ద వడపోత బావుల్లో గత 5 ఏళ్లుగా ఇసుక మార్చలేదని, విద్యుత్తు ఉప కేంద్రానికి వెళ్లే దారి అభివృద్ధి చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, తెదేపా, జనసేన, భాజపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శృంగారపురంలో భూమిపూజలో ఎంపీపీ జబీన్, శ్రీఅనిత, సాయిచైతన్య, సర్పంచి సుధారాణి

'నివాసాల నడుమ మద్యం దుకాణమా..?'

తాడేపల్లి: తాడేపల్లి ఆశ్రమం రోడ్డులో మద్యం దుకాణం వద్దంటూ ఆయా ప్రాంతబహుళ అంతస్తులవాసులు మంగళవారం ఉదయం ఆందోళనకు దిగారు. ఈమేరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నారన్న సమాచారంతో వారంతా మూకుమ్మడిగా ఘటనా ప్రదేశానికి చేరుకుని ఆందోళన నిర్వహించారు. కొంతమంది నాయకులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. దీనిపై దుకాణం నిర్వాహకులను వివరణ కోరగా.. తాము ఆ ప్రాంతంలో దుకాణం ఏర్పాటు చేసే ఆలోచన తమకు లేదని వివరించారు.



నిరసన తెలుపుతున్న బహుళ అంతస్తులవాసులు

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి

మంగళగిరి, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ పాలనలో దేశం శరవేగంగా అభివృద్ధి సాధిస్తోందని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తులిమిల్లి రామకృష్ణ అన్నారు. మంగళగిరి గాలిగోపురం వద్ద మంగళవారం భాజపా సభ్యత్వం నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి కేంద్రం తగు సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి రవికిరణ్, వీవర్స్‌సెల్ రాష్ట్ర కన్వీనర్ జగ్గారపు శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కాండ్రు భానుకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళతో అసభ్య ప్రవర్తన

మేడికొండూరు, న్యూస్‌టుడే: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై మంగళవారం మేడికొండూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని సిరిపురానికి చెందిన సాయికుమార్ పెయింటింగ్ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని గమనించిన అతడు లోపలికి చొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అభివృద్ధి నిలిచి.. సమస్యలు మిగిలి..

గత జగన్ ప్రభుత్వ తీరుతో ప్రజల ఇక్కట్లు

రాయపూడి, దొండపాడు గ్రామాల్లో ఇదీ పరిస్థితి

తుళ్లూరు, న్యూస్‌టుడే

ఐదేళ్ల వైకాపా ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులను గాలికొదిలేసింది. పల్లెల్లో ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అరకొర పథకాలతో కాలం గడిపేసింది. ఏ గ్రామంలో చూసినా సమస్యలు దర్శనమిస్తున్నాయి. రాజధాని గ్రామం రాయపూడి, దొండపాడు గ్రామాల్లో రోడ్లు, మురుగు కాలువలు తదితర వసతులు పూర్తిస్థాయిలో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టిసారించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కదలని వ్యర్థాలు

తుళ్లూరు, దొండపాడు, వైకుంఠపురం వైపు నుంచి వచ్చే వరద నీరు రాయపూడి గ్రామం మీదుగా పాలవాగు ద్వారా కృష్ణానదిలో కలుస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా వాగులో తూటికాడ, పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో పూడిపోవటం, గ్రామం సరైన కాలువలు లేక పోవటంతో భారీ వర్షాలు పడినప్పుడు వరద నీరు గ్రామంలోకి వస్తుంది. పాలవాగును అభివృద్ధి చేసి సమస్యను పరిష్కరించాల్సి ఉంది. రాజధాని నగర పరిధిలో గ్రామాలు ఉన్నందున సీఆర్డీఏ నిధుల ద్వారా పనులు చేయాల్సి ఉంది.

ఈద్గాకు ఏదీ స్థలం..?

రాయపూడిలో పెద్ద సంఖ్యలో ఉన్న ముస్లిం సోదరులు తాము ప్రార్థనలు చేసుకునేందుకు ఈద్గా ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నారు. రాజధాని భూ సమీకరణ సమయంలో తెదేపా ప్రభుత్వం ఇచ్చిన హామీనీ కూటమి ప్రభుత్వంలో సాకారం చేయాలని ముస్లిం సోదరులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈద్గాకు రెండెకరాలు, షాదీఖానాకు అరెకరం చొప్పున కమ్యూనిటీ హాలు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.



రహదారిపైనే ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు (పాత చిత్రం)

తాగునీటికి కటకట..

రాయపూడి గ్రామంలో ప్రస్తుతం జనాభా 7 వేల వరకు పెరిగింది. గ్రామంలో నిర్మించిన తాగు నీటి ట్యాంకుతో పాటు మరో ట్యాంకు నిర్మాణం చేయాల్సిన అవసరం ఉంది. 30 సంవత్సరాల క్రితం వేసిన పైపుల లైన్లు తుప్పుపట్టి పాడై పోవడంతో గృహాలకు తాగు నీరు అందటం లేదు. కొత్తగా తాగు నీటి ట్యాంకు నిర్మించి, హెచ్‌డీ పైపులైన్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు. దొండపాడులో ప్రస్తుతం 4 వేలు జనాభా నివసిస్తున్నారు. గ్రామంలో నిర్మించిన చిన్న సైజు తాగు నీటి ట్యాంకులు స్థానికుల తాగు నీటి అవసరాలకు సరిపోవటం లేదు. రాయపూడి నుంచి వేసిన పైపులైన్లు నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయి.



దొండపాడులో తక్కువ సామర్థ్యంతో తాగునీటి ట్యాంకు

రహ'దారుణం'..

రాయపూడి, దొండపాడు గ్రామాల మధ్య ఉన్న అనుసంధాన రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లు కుంగి గోతులు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. దీంతోపాటు గ్రామాల్లో సీసీ రోడ్లు, సైడు కాలువలు, డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాల్సి ఉంది.



దొండపాడు సమీపంలో ఏర్పడిన గోతులు

మిర్చి యార్డు సమీపంలో కార్మికుడి మృతి

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: మిర్చి యార్డు సమీపంలోని వై- జంక్షన్ వద్ద శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు కోల్డ్ స్టోరేజీలో పనులు చేసేందుకు నాలుగు నెలల క్రితం గుంటూరు వచ్చిన కృష్ణ(35) అనే వ్యక్తి నారాయణాద్రి ఏసీ కోల్డ్ స్టోరేజీ సమీపంలోని దుకాణాల ఎదుట విగతజీవిగా పడి ఉండడాన్ని గమనించిన స్థానిక వ్యాపారులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోలీసులు జీజీహెచ్‌కు తరలించారు. ఇతర వివరాలు తెలియరావాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

చిరస్మరణీయుడు నారాయణ

పెదనందిపాడు: రైతుల, పేదల సమస్యల పరిష్కారానికి దివంగత తెల్ల నారాయణ చేసిన కృషి చిరస్మరణీయమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. నారాయణ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక విజ్ఞాన్ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పారిశ్రామిక వేత్త శేషగిరిరావు కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెల్ల నారాయణ విజ్ఞాన కేంద్ర ట్రస్టు సమన్వయకర్త రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెదనందిపాడులో విజ్ఞాన కేంద్ర నిర్మాణానికి నారాయణ కుటుంబ సభ్యులు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. ఇక్కడ విద్యార్థులకు నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలని, మహిళలకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించేందుకు గత ప్రభుత్వం భూ సేకరణకు నిధులు కేటాయించలేదన్నారు. కౌలు రైతులకు 2011లో అప్పటి ప్రభుత్వం రక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టిందని, జగన్ ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దు చేసిందని పేర్కొన్నారు. అనంతరం నాట్స్ సహకారంతో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని దాసరి శేషగిరిరావు ప్రారంభించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త ఎం.రాఘవయ్య, ప్రిన్సిపల్ వీరరాఘవయ్య , సీపీఎం నాయకులు కాపు శ్రీనివాసరావు, సుబ్బారావు, విజ్ఞాన కేంద్ర ట్రస్టు సహ సమన్వయకర్త వెంకట శివరావు, సభ్యులు రామారావు, వెంకటేశ్వర్లు, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, పారిశ్రామికవేత్త శేషగిరిరావు తదితరులు

తెనాలి వాసులకు పురస్కారాలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: సదరన్ ప్రైవేటు లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ సంస్థ తెనాలికి చెందిన పలువురు విద్యావేత్తలకు అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారాలను మంగళవారం ప్రకటించింది. విశ్రాంత ఉపాధ్యాయులు వేజళ్ల ఉమామహేశ్వర్, మొవ్వా సత్యనారాయణ, రాయపాటి శివనాగేశ్వరరావు, నెహ్రూనికేతన్ ఉన్నత పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, మాంటిస్సోరి ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ జేమ్స్ మొరెలి ఈ పురస్కారాలను అందుకోనున్నారు. ఈ నెల 20న గుంటూరులో సంస్థ గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య పర్యవేక్షణలో వేడుక జరుగనుంది.

వెయిట్ లిఫ్టింగ్‌లో పీబీఎన్ క్రీడాకారుడికి పతకం



పొన్నూరు, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం నగ్‌రోటా పట్టణంలో జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నిడుబ్రోలు పీబీఎస్ కళాశాల బీకాం మెదటి సంవత్సరం విద్యార్థి, క్రీడాకారుడు సిహెచ్.వెంకటేష్ 89 కేజీల విభాగంలో 254 కేజీల బరువు ఎత్తి రజత పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.శివకుమారి మంగళవారం వెల్లడించారు. ఈ సందర్భంగా వెంకటష్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

గత వైకాపా పాలన లోపం

గర్భిణులకు భోజనం దూరం

❖ పొన్నూరు ప్రభుత్వ వైద్యశాలలో పరిస్థితి ఇది

నిడుబ్రోలు (పొన్నూరు), న్యూస్‌టుడే



బాలింతల వార్డు

గత తెదేపా ప్రభుత్వ (2014-19) కాలంలో పొన్నూరు ప్రభుత్వ వైద్యశాల లో గర్భిణులు, బాలింతలకు రోజూ ఉదయం, రాత్రి పోషకాలతో కూడిన భోజనంతో పాటు, ఉదయం పోషకాలతో కూడిన ఆహారం అందించారు. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత కొంత కాలం పాటు గర్భిణులకు భోజనం అందించి ఆపివేశారు. గత నాలుగున్నరేళ్ల వైకాపా పాలనలో నేతలు, అధికారులు భోజనం అందిస్తామని మాయ మాటలతోనే కాలయాపన చేశారు.

పేదలపై భారం

స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రతి నెల 15 నుంచి 20 మంది గర్భిణులు ప్రసవిస్తున్నారు. ఎక్కువ మంది నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కావడంతో ప్రైవేటు వైద్యశాలల్లో వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ప్రభుత్వ వైద్యశాలకు వస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం అల్పాహారం, పాలు, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం భోజనం అందించాల్సి ఉంది. అందుకుగాను ఒక్కొక్క గర్భిణికి రూ.100 చొప్పున గుత్తేదారుడికి చెల్లిస్తామని నాడు వైద్యులు ప్రకటించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో గిట్టుబాటు కాక ఆహారాన్ని అందించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని వైద్యులు చెబుతున్నారు. నాటి నుంచి ప్రైవేటు ఫలహారశాలలకు వెళ్లి భోజనాన్ని తెచ్చుకుంటున్నారు. అందుకు గాను ఒక్కో భోజనం రూ.100 నుంచి రూ.120 చెల్లిస్తున్నామని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం భోజనానికి, ఆటో ఖర్చులకు రూ.250 ఖర్చు చేయాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పేద గర్భిణులకు ఆహారాన్ని అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం.. పొన్నూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ రేష్మను న్యూస్‌టుడే వివరణ కోరగా గర్భిణులకు ఆహారం అందించేందుకు అనేక సార్లు టెండర్లు వేసిన ఎవరూ ముందుకు రాలేదని, వీలైనంత త్వరితగతిన ఈ సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని చెప్పారు.

ఆసుపత్రిలో వివరాలు

సంవత్సరం	ప్రసవాలు
2019	268
2020	184
2021	171
2022	132
2023	211
2024	91

(ఇప్పటివరకు)



పాత పొన్నూరుకు చెందిన **తమనం దివ్యశ్రీ** ఇటీవల స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో బిడ్డకు జన్మనిచ్చారు. నాలుగు రోజుల పాటు చికిత్స పొందారు. ఎటువంటి ఆహారం అందించలేదు. కుటుంబసభ్యులు రోజూ రెండు పూటలా ఇంటి వద్ద నుంచి భోజనం తెచ్చారు. వైద్యశాల దూరం కావడంతో భోజనం తెచ్చే సమయంలో చాలా ఇబ్బందులు పడ్డారు. పోషకాహారం ఆసుపత్రి నుంచి అందేలా చూడాలని ఆమె కోరారు.



స్థానిక 19వ వార్డుకు చెందిన **మాణిక్యల అనురాధ** 15 రోజులు కిందట పొన్నూరు ప్రభుత్వ వైద్యశాలలో బిడ్డకు ప్రసవించారు. భర్త కూలి పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇంటి వద్ద నుంచి వైద్యశాలకు 3 కిలోమీటర్లు దూరం ఉంది. వైద్యశాలలో ఐదు రోజులు ఉండగా ఎక్కువ రోజులు ఇంటి వద్ద నుంచే భోజనం తెచ్చారు. ఒక్క రోజు ఫలహారశాల నుంచి రూ.100 పెట్టి భోజనం తెచ్చుకున్నాం. బయట భోజనం చేసిన తర్వాత ఆరోగ్యపరంగా కొంత ఇబ్బంది పడ్డానని ఆమె చెప్పారు.

సమస్యలతో సహవాసం



బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల క్వార్టర్లలో పిచ్చిమొక్కలు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే



గురవయ్య కాలనీలో కచ్చా కాలువతో కదలని మురుగు

పేదలు, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ఉండే రామలింగేశ్వరపేటలోని గురవయ్య కాలనీ, తోటవారివీధిల్లో పక్కా కాలువలు, రోడ్ల నిర్మాణాలు, కుళాయిల ద్వారా నీటిని అందిస్తామని వైకాపా పాలనలో ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటికి తోడు వీధి కుక్కలు, ఖాళీ స్థలాలు, పందులు, దోమల తదితర సమస్యలు స్థానికులను వెంటాడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో గురవయ్య కాలనీలో పక్కా కాలువలు, రోడ్లు వేసేందుకు అంచనాలు తయారు చేసి టెండరు పిలిచి గుత్తేదారుడిని ఎంపిక చేశారు. వీటిల్లో కొన్ని పనులు చేసి వదిలేయడంతో ఇళ్ల ముందు మురుగు ముందుకు కదలని కాలువలు, పల్లపు రోడ్లలో చేరిన వర్షపు నీరు బయటకు మళ్లించక అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇంటింటికీ ఇచ్చిన కుళాయిల్లో పంపిణీ చేసిన నీటిని కాలనీ వాసి బండి లక్ష్మి తాగి అస్వస్థతకు గురై మృతి చెందడంతో స్థానికులు శుద్ధ జలం తీసుకుంటున్నారు. కొనలేని వారు నీరు కాచి తాగుతున్నారు. కుళాయిల్లో నీరు వాసన వస్తున్నట్లు వాపోతున్నారు. రెండేళ్లుగా 70 కుటుంబాలకు కుళాయిల నుంచి నీరు అందించలేక ట్యాంకర్ల అరకొర పంపిణీ చేసి నీటిపన్ను చెల్లించమని నోటీసులు ఇచ్చినట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీరు రాని కుళాయి కనెక్షన్‌కు రూ.12 వేలు డొనేషన్ చెల్లించాలంటున్నారని వాపోతున్నారు. చీకటి పడితే వీధి కుక్కలు వెంటపడుతున్నట్లు ఆందోళన చెందుతున్నారు. మురుగు కాలువలు శుభ్రం చేయక దోమకాటు పెరిగిపోయిందని వాపోతున్నారు.

మున్సిపాలిటీ పట్టించుకోవడం లేదు



వారానికోసారి కాలువలు శుభ్రం చేస్తుంటారు. దోమల బెడద ఎక్కువగా ఉంది. పల్లపు రోడ్లపై వర్షపు నీరు చేరి బయటకు మళ్లించక దుర్వాసన వ్యాపిస్తోంది. రాత్రిళ్లు వీధి కుక్కలు వెంట పడటంతో బయట తిరగలేకపోతున్నాం. విద్యుత్తు స్తంభాలకు పిచ్చిమొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. **- శివరామిరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపల్, తోటవారివీధి**

నీరు ఇవ్వకుండా పన్ను నోటీసు



రెండేళ్ల కిందట ఇచ్చిన కుళాయిల్లో తాగునీరు రాదు. వీటికి పన్ను చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. ఒక ట్యాంకర్ నీరు పంపించి సరిపుచ్చుతున్నారు. భూగర్భంలోని పైపులు వద్ద ఏర్పడిన ఈ సమస్యకు రెండేళ్ల నుంచి పరిష్కారం చూపకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. **- వి.వెంకటేశ్వరరావు, రైతు, గురవయ్యకాలనీ శివారు**

బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపల్ సరళ

నంబూరు (పెదకాకాని), న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన నంబూరు వివా దిస్కూల్‌కి చెందిన గ్రేడ్ 6 విద్యార్థి బానాల ఇషాన్, గ్రేడ్ 9 విద్యార్థి బొల్ల సత్యేంద్రను వివా ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రామచంద్రాపురంలో రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో విద్యార్థులిద్దరూ జిల్లా జట్టు తరపున ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించటంలో కీలక పాత్ర వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివా డైరెక్టర్ ఎల్‌టీ కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సరళ, తదితరులు పాల్గొన్నారు.

అందరూ మొక్కలు విరివిగా నాటాలి

సుద్దపల్లి (చేబ్రోలు), న్యూస్‌టుడే: రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు విరివిగా నాటి వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ అన్నారు. మండలంలోని సుద్దపల్లిలో వనసంరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఊర చెరువు చుట్టూ మొక్కలు నాటారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, కూటమి నాయకులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.



సుద్దపల్లిలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? క్యాబిన్‌పేటలో వీధి దీపం వెలగడం లేదు. రాత్రి సమయంలో రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా ఉంది.
-పి.నాగేశ్వరరావు, క్యాబిన్‌పేట

✔ వీధి దీపం బాగు చేయిస్తాం. **-అపర్ణ, సహాయ ఇంజినీర్**

? సాంబశివనగర్‌లో కొద్ది రోజులు నుంచి చెత్త తొలగించలేదు. రహదారి పైకి రావడంతో దుర్గంధం వస్తోంది.
- ఎ.రాంబాబు, సాంబశివనగర్

✔ చెత్తను తొలగింపచేస్తాం **-శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి.**
-న్యూస్‌టుడే, పొన్నూరు.

? మారీసుపేట అంగజాల వారి రోడ్డులో ఆరు నెలలుగా వీధి దీపాలు వెలగటం లేదు. చీకటి వల్ల పెద్దలు, పిల్లలు అందరమూ ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు**

✔ సత్వరం మరమ్మతులు చేయిస్తాం. సమస్య కొనసాగటంపై సిబ్బందితో మాట్లాడతాను. **- బి.శేషన్న, మున్సిపల్ కమిషనర్**
–న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మురుగు సమస్యకు పరిష్కారం: పట్టణ నందులపేట జెండా చెట్టు బజార్‌లో మురుగు పారుదల సమస్యను ఈ నెల 15న స్థానికులు మున్సిపల్ అధికారులకు తెలియచేయగా సిబ్బంది పూడికలు, అడ్డంకులు తొలగించారు.

స్పందనకు వందనం

వ్యర్థాల తొలగింపు

మేమున్నాం...మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి ప్రజారోగ్యశాఖాధికారులు స్పందించారు. డీవీసీ కాలనీలో మురుగు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. **-న్యూస్‌టుడే, తెనాలి టౌన్, పొన్నూరు**

ఏఎన్‌యూలో ఎల్ఎల్ఎం పరీక్షలు ప్రారంభం

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం న్యాయ విభాగంలో ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఏఎన్‌యూలోని పరీక్ష కేంద్రాన్ని పీజీ పరీక్షల సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు పరిశీలించారు. పరీక్షలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం నుంచి బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ పరీక్షలు ప్రారంభం కానున్నాయని సుబ్బారావు చెప్పారు.

అర్చకులకు స్వయం ప్రతిపత్తి హర్షణీయం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: దేవాలయాల్లో వైదిక కార్యక్రమాల నిర్వహణపై అర్చకులకు స్వయంప్రతిపత్తి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం హర్షణీయమని అర్చక సమాఖ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ తమిరిశ అనంతాచార్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞత తెలిపారు.

గ్రామాభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, వేదికపై ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు

చేబ్రోలు, న్యూస్‌టుడే: గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని శేకూరులో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాతో కలిసి ఆమె భూమి పూజ చేశారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు జరిగే గ్రామ సభల్లో ప్రజలకు అత్యవసరమైన పనులను గుర్తించి వాటిని ఉపాధి హామీ పథకంలో పూర్తి చేయనున్నట్టు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 156 పనులకు గాను రూ.15 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని, ఈ పనులను సంక్రాంతి పండగలోపు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేసుకోవాలని కోరారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు త్వరలోనే చేపడతామన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ చేబ్రోలు మండలంలో 12 పనులకు గాను రూ.1 కోటి కేటాయించారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజాపాలన వచ్చిందని, గ్రామాల్లోని ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందనున్నాయన్నారు. శేకూరు, వీఎన్‌పాలెం గ్రామాల్లో క్షేత్ర స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కొంత మంది రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, వారికి కూడా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముందుగా జనసేన పార్టీ నియోజక సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబుతో కలిసి వేజండ్లలో రూ.17 లక్షలు, సుద్దపల్లిలో రూ.7 లక్షలు, శలపాడులో రూ.6 లక్షలు, వీఎన్ పాలెంలో రూ.4లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్ల పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీకుమారి, డ్వామా పీడీ శంకర్, తహసీల్దార్ శ్రీనివాస శర్మ, ఎంపీడీవో లలిత, తెదేపా, జనసేన మండలాల అధ్యక్షులు రామరాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

బహిరంగ మద్యపానంతో వెతలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని రామలింగేశ్వరపేట డిపో కూడలి ప్రాంతంలో సాయంత్రం అయితే బహిరంగ మద్యపానం మొదలౌతుంది. రోడ్డు వెంబడి, అరుగుల మీద, ఆటోల్లో కూర్చుని మందు తాగే వాళ్లతో ఈ ప్రాంతంలో ఇబ్బందికర వాతావరణం నెలకొంటుంది. పోలీసులు పెట్రోలింగ్‌కు వచ్చినప్పుడు పక్కనే ఉన్న పాఠశాల ఆవరణలోకి దూకటం కూడా అలవాటుగా మారింది. ఇటీవల పెట్రోలింగ్‌కు వచ్చిన పోలీసులతో మద్యం మత్తులో ఉన్న కొంత మంది వాగ్వాదానికి దిగటంతో సీఐ, ఎస్సైతో సహా వెళ్లి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాల్సి వచ్చింది. పోలీసులు దృష్టి పెట్టి, పెట్రోలింగ్‌లు పెంచి ఇబ్బందికర పరిస్థితులను మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

డిస్లెక్సియాను తొలి దశలో గుర్తిస్తే మేలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: చదవటం, రాయడం తదితర నేర్చుకునే అంశాల విషయంగా కొంత మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే సమస్యను డిస్లెక్సియా అంటారని, తొలి దశలోనే గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ పెడితే సమస్య పరిష్కారం అవుతుందని మండల విద్యాశాఖాధికారులు లక్ష్మీనారాయణ, జయంతిబాబు పేర్కొన్నారు. ప్రపంచ డిస్లెక్సియా అవగాహన వారోత్సవాల సందర్భంగా మంగళవారం పట్టణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు.

వరికి దోమ పోటు ఉన్నట్లు గుర్తింపు

శ్రీరంగపురం(చేబ్రోలు),న్యూస్‌టుడే: లోతు దుక్కులు వేయడం వల్ల కలుపు సమస్యను కొంత మేర తగ్గించుకోవచ్చని ఏవో శ్రీనివాసా నాయక్ అన్నారు. మండలంలోని శ్రీరంగపురం, తోట్లపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటలో దుబ్బుకి 10 నుంచి 15 దోమలు ఉన్నట్టు గుర్తించామని, వాటి నివారణకు చెస్, టోకెన్ మందులు పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సునీత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



ఘటనా స్థలంలో గాయపడిన తండ్రి, ఇద్దరు కుమారులు

అమృతలూరు, న్యూస్‌టుడే: అమృతలూరు మండలం కూచిపూడిలాకు కూడలి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. తెనాలికి చెందిన వెంకటేశ్వరరావు చీరాలలో పనులు ముగించుకుని తెనాలికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఏలూరు నుంచి పిట్టలవానిపాలెం వెళ్లేందుకు తండ్రి పోతురాజు, కుమారులు లక్ష్మీనారాయణ, సత్యంబాబు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. కూచిపూడి లాకుల కూడలి సమీపంలో ఎదురెదురుగా వస్తున్న వీరి ద్విచక్రహనాలు అదుపుతప్పి ఢీకొన్నాయి. ఈ సంఘటనలో వెంకటేశ్వరావు, పోతురాజులకు తీవ్రగాయాలయ్యాయి. లక్ష్మీనారాయణ, సత్యంబాబుకు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చరవాణి చోరీ.. రూ.లక్ష బదిలీ

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: రైల్లో చోరీకి గురైన ప్రయాణికుడి చరవాణి నుంచి రూ.లక్ష నగదు బదిలీ కావడాన్ని గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. తెనాలికి చెందిన సత్తయ్య ఆసుపత్రిలో ఉన్న తన కుమారుడి వద్దకు వెళ్లేందుకు ఈనెల 9న పల్నాడు స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైల్లో గుంటూరు నుంచి సికింద్రాబాద్‌కు వచ్చాడు. రైలు దిగే సమయంలో తన జేబులోని చరవాణి చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఇబ్రహీంపట్నంలో ఆసుపత్రిలో ఉన్న కుమారుడి వద్దకు వెళ్లి మరుసటి రోజు కొత్త సిమ్‌కార్డును తీసుకున్నాడు. తన ఫోన్‌పే నుంచి రూ.1,00,500 నగదు బదిలీ జరిగినట్లుగా గుర్తించాడు. బాధితుడు ఈ సంఘటనపై జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బంగారు నగల అదృశ్యంపై ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: స్థానిక నందులపేటలోని ఒక ఇంటిలో ఈ ఏడాది జులైలో వ్రతం ఆచరించి బంధువులను పిలుచుకున్నారు. అందరూ వెళ్లిపోయిన తరవాత ఇంటిలో ఉండాల్సిన రూ.2 లక్షల విలువైన బంగారు ఆభరణాల పెట్టె కనిపించలేదు. దీనితో పలుమార్లు వ్రతానికి హాజరైన వారితో మాట్లాడిన తర్వాత తుదకు వారు రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం రవాణాపై కఠిన చర్యలు



సమావేశంలో సీఐ నారాయణస్వామి, తహసీల్దార్ కృష్ణకాంత్, డీటీలు ప్రసాద్, వెంకట్రావు

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మండలంలో ఎవరైనా రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ కృష్ణకాంత్, సీఐ నారాయణస్వామి తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనదారులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెదకాకాని మండలంలో ఎండీయూ వాహనదారులు బియ్యం అక్రమ రవాణా చేయాలని భావిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ప్రజల నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, పౌరసరఫరాల శాఖ డీటీ వెంకట్రావు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం యువతకు స్ఫూర్తి



తెనాలి: అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: సాధారణ స్థాయి నుంచి దేశానికి మార్గదర్శిగా నిలిచిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అందరికీ స్ఫూర్తిదాయకులని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా స్థానిక చినరావూరుతోటలోని శ్రీగీతాంజలి పబ్లిక్ స్కూల్లో మంగళవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. డైరెక్టర్ ఎన్.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ పద్మజ పర్యవేక్షించారు. స్థానిక ఐక్య వేదిక కార్యాలయంలో అక్కిదాసు కిరణ్‌కుమార్, దుబాయ్‌బాబు, గౌస్, జస్వంత్, శశికుమార్, సైదా తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేటి యువతకు మార్గదర్శకులని పొన్నూరు వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాదాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను నేతలు కొనియాడారు.

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఏఎన్‌యూలో ఘనంగా నిర్వహించారు. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి సమర్పించారు. అనంతరం వీసీ గంగాధర్ మాట్లాడుతూ మిస్సైల్ మెన్‌గా ఖ్యాతి గడించిన కలాం జీవితాన్ని విద్యార్థులంతా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య స్వరూపారాణి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిద్దయ్య, సీడీఈ సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు, ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు, వికాస ప్రధాన కార్యదర్శి కావూరి సాంబశివరావు పాల్గొన్నారు.

ప్లాన్ లేని నిర్మాణాల తొలగింపు



వైకాపా నాయకుడి అనుమతిలేని నిర్మాణానికి రంధ్రం పెడుతున్న కార్మికుడు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళికా అధికారులు పలు చోట్ల అనుమతి లేని భవన నిర్మాణాలను తొలగించారు. నాజర్‌పేటకు చెందిన వైకాపా నాయకుడు శ్రీనివాసరావు ప్లాన్ తీసుకుని వంకమామిడి వారి వీధిలో ఓ భవనం నిర్మించారు. ఆయనే ఇటీవల అనుమతి లేకుండా పైన పిల్లర్లు పోయించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం కూలీలతో ఆ పిల్లర్లకు రంధ్రాలు పెట్టి ఛిద్రం చేయించారు. టంకసాల వారి వీధిలో ప్లాన్ లేకుండా పోయించిన పిల్లర్లకు రంధ్రాలు పెట్టిస్తుండగా సదరు భవన యజమాని అడ్డుకున్నారు. అదే సమయంలో అధికారులకు ఫోన్ కాల్ రావడంతో వారు చేసే పనిని ఆపి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిపై టీపీవో సాంబశివరావు మాట్లాడుతూ సదరు భవన యజమాని ఆ పిల్లర్లను తానే తొలగించుకుంటానని కోరడంతో సిబ్బందిని వెనక్కి పంపించినట్లు తెలిపారు. పట్టణంలో ఇప్పటికే ప్లాన్ లేకుండా నిర్మించిన భవనాలు పది వరకు ఉన్నాయని, కమిషనర్ ఆదేశాలతో వాటి తొలగింపు పనులు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మద్యం మత్తులో గొడవ

❖ గాయపడిన వ్యక్తి మృతి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు గొడవ పడగా.. వారిలో ఒకరు మృతి చెందారని త్రీ టౌన్ పోలీసులు మంగళవారం రాత్రి తెలిపారు. స్థానికంగా క్యాటరింగ్ పనులు చేసే కరణం అమర్చంద్ (35)ను జనార్దనరావు తోయడంతో అతను కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఈ నెల 5న తెనాలి రైల్వేస్టేషన్ రోడ్డులో జరిగింది. అమర్చంద్ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడన్న సమాచారం పోలీసులకు అందింది. దానితో వారు విచారణ చేసి నిందితుడు జనార్దనరావును అరెస్టు చేశారు. ఇరువురికి సంబంధించిన ఎటువంటి సమాచారం స్థానికంగా లభించక కేసు విచారణ ఆలస్యం అయిందని సీఐ రమేష్‌బాబు తెలిపారు.

విద్యుత్తు చౌర్యం


తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మండలంలోని కొలకలూరులో రోడ్డు వెంబడి పండ్లు విక్రయించే పాకలో నేరుగా విద్యుత్తు లైను నుంచి తీగ ఏర్పాటు చేసుకుని చౌర్యం చేస్తున్నట్లు విద్యుత్తు విజిలెన్స్ విభాగ అధికారులు మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో గుర్తించారు. రాజేంద్రబాబు అనే వ్యక్తికి రూ.2 వేలు అపరాధ రుసుము విధించి విద్యుత్తు కనెక్షన్ తీగను తొలగించినట్లు విజిలెన్స్ ఏడీఈ ఎన్.ఎం.ప్రసాద్ తెలిపారు.

గుంటూరు తూర్పు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: టౌన్-2 సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేస్తున్నందున ఈనెల 16న విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈఈ గురవయ్య తెలిపారు. దీనివల్ల బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు రవీంద్రనగర్, శ్యామలనగర్, స్తంభాలగరువు, అదేవిధంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పట్టాభిపురం, డీఆర్ఎం కార్యాలయ రహదారి తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని వెల్లడించారు.

ధర వరలు



ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాటా 48, వంగ 24, బెండ 22, పచ్చిమిర్చి 45, కాకర 34, క్యారెట్ 45, క్యాలిఫ్లవర్ 38, క్యాబేజీ 45, బీర 28, దొండ 26, బంగాళదుంప 39, ఉల్లిపాయలు 32, గోరుచిక్కుళ్లు 30, దోస 32, పొట్ల 32, మునగ 8, పెద్ద చిక్కుళ్లు 84, చామదుంప 40, మునగ రూ.8, గోంగూర 10, తోటకూర 15, కొత్తిమీర 25, బీట్‌రూట్ 39, కీర 24, క్యాప్సికం 64, అల్లం 60, ఫ్రెంచి బీన్స్ 94, సొర 16, అరటి 7.

-న్యూస్‌టుడే, పట్నంబజారు

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి సాయం



చెక్కు అందిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆర్మ్‌డ్ రిజర్వు హెడ్ కానిస్టేబుల్ రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. అతని కుటుంబ సభ్యులకు ప్లాగ్‌ఫండ్, చేయూత పథకం నిధులు రూ.1.75 లక్షలు చెక్కును మంగళవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తన కార్యాలయంలో అందజేశారు.

మేయర్‌ను కలిసిన నూతన ఎస్ఈ

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగర పాలకసంస్థ నూతన సూపరింటెండింగ్ ఇంజినీరింగ్ నాగమల్లేశ్వరరావు మంగళవారం మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడును సంపత్ నగర్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా నగరంలో అభివృద్ధి పనుల గురించి చర్చించారు.

చౌక దుకాణం ఆకస్మిక తనిఖీ



చౌకదుకాణంలో సరుకులు పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రావణ్‌కుమార్ తదితరులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని కన్నావారితోటలోని చౌక దుకాణాన్ని మంగళవారం విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రావణ్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ నిల్వలను, డీలర్ లైసెన్సును తనిఖీ చేశారు. ఎస్పీ వెంట సీఐలు చంద్రశేఖర్, శివాజీ, తహశీల్దార్ శివశంకర్ ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. గుత్తేదారులపై భారం

బిల్లుల చెల్లింపుల్లో తీవ్రజాప్యం

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపులపై అధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. డివిజన్ల వారీగా ఇంజినీరింగ్ విభాగం పరిధిలో ఏడాది కిందట పూర్తయిన పనులకూ ఇప్పటికీ జీఎంసీ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని గుత్తేదారులు వాపోతున్నారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేయించుకుని బిల్లుల చెల్లింపుల విషయంలో మాత్రం తమకు ఎటువంటి బాధ్యత లేనట్టుగా అధికారులు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.



జీఎంసీ కార్యాలయం

పెరుగుతున్న వడ్డీలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆగస్టులో అప్పటి కమిషనర్‌గా పనిచేసిన హరికృష్ణ రూ.25 కోట్లకుపైగా బిల్లులు చెల్లించారు. కానీ తాజాగా పెండింగ్ బిల్లులు రూ.50 కోట్లకు పైగానే ఉంటాయని గుత్తేదారులు చెబుతున్నారు. బిల్లులు జాప్యం చేయడంతో వాటికి భారీగా వడ్డీలు పెరిగి తీవ్ర నష్టాలు బరాయించాల్సి వస్తుందని వాపోతున్నారు. నూతన కమిషనర్ శ్రీనివాసులు వచ్చాక కొద్ది రోజుల కిందట గుత్తేదారులు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పెండింగ్ బిల్లుల సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

నూతన టెండర్లకు ముందుకురాని వైనం

గుత్తేదారులకు భారీగా బిల్లులు పెండింగ్ ఉండడంతో కొత్తగా పనులు చేసే మళ్లీ ఎప్పుడు వస్తాయో నని పనులు చేసేందుకు ముందుకు రావడంలేదు. గతంలో పనులు చేసిన వారికి కొంత వరకైనా చెల్లింపులు చేస్తే తిరిగి పనులు ప్రారంభించే అవకాశం ఉంటుంది. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన గుత్తేదారులకు కూడా నాటి నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే చాలా బిల్లులను అధికారులు సీఎఫ్ఎంఎస్ పరిధిలోకి తీసుకెళ్లడంతో పదుల సంఖ్యలో గుత్తేదారులు తమ బిల్లులు ఎప్పుడు వస్తాయో కూడా తెలియక ఆందోళనలో ఉన్నారు. సీఎఫ్ఎంఎస్‌లో సుమారు రూ.400 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలుస్తోంది.

ఆంజనేయస్వామికి వెండి సర్వాంగం సమర్పణ



వెండి సర్వాంగం వస్తువులతో భక్తులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: పాతగుంటూరులోని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలోని స్వామివారికి మంగళవారం స్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా చిరుమామిళ్ళ వెంకటకృష్ణారావు, లక్ష్మీ దంపతులు వెండి నూతన సర్వాంగం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి దంపతుల్ని శాలువతో సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.బాబూరావు, కార్యదర్శి కె.సాంబశివరావు, కోశాధికారి జి.కోటేశ్వరరావు, సభ్యులు నాగ మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీల పోస్టులు భర్తీ చేయాలని, గత యేడాదిగా పెండింగ్‌లో ఉన్న సహాయకులకు ఉద్యోగోన్నతుల సమస్య పరిష్కరించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి దీప్తిమనోజ డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు పీడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దీప్తిమనోజ మాట్లాడుతూ.. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం పీడీ ఉమాదేవికి వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షురాలు కుమారి, నాయకులు నేతాజీ, రాధ, చినవెంకాయమ్మ, సకన్న తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జీవితం యువతకు స్ఫూర్తి



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నసీర్

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తమిళనాడులోని రామేశ్వరంలో సామాన్య కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం స్వయంకృషితో ఉన్నత శిఖరాలు అధిరోహించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

నగరపాలకసంస్థ: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు తమ కలల సాకారానికి కృషి చేయాలని జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షులు కేవీ రమణ అన్నారు. భారత్‌పేటలోని నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమబోర్డు పునరుద్ధరించండి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, పక్కన తదితరులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ కోరారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచిత ఇసుక హామీ అమలు చేయాలన్నారు. రాజధాని ప్రాంతంలో నిర్మాణాలకు స్థానికులకు అవకాశం కల్పించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కరించాలని కోరుతూ స్థానిక ప్రజాప్రతినిధులు వినతిపత్రాలు ఇవ్వాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. సమావేశంలో నాయకులు వలి, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళల నిరాహార దీక్ష విరమణ



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గత అయిదేళ్ల వైకాపా పాలనలో ఆపార్టీ నాయకుల చేసిన అక్రమాలపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరుతూ వికాస్‌నగర్‌లో ఆదర్శ మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలు చేస్తున్న నిరాహార దీక్షను ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు విరమింపజేశారు. స్వర్ణభారతినగర్‌కు చెందిన కోవూరు శ్రీలక్ష్మి మరో ఇద్దరు మహిళలతో కలిసి వికాస్‌నగర్‌లోని ఇంట్లో మూడు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని వైకాపా నాయకులు పేదల ఇళ్లస్థలాలను ఆక్రమించి అమ్ముకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను పలు మార్లు కోరినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లామన్న అక్కసుతో వైకాపా గుండాలు తమపై దాడి చేసినా పోలీసులు, అధికారులు పట్టించుకోలేదు. అందుకే తాము ఈ దీక్ష చేపట్టామని ఎమ్మెల్యే రామాంజనేయులుకు మహిళలు తెలిపారు. దీనికి ఆయన స్పందిస్తూ వైకాపా నాయకులపై కేసులు నమోదు చేయించి అరెస్ట్ చేయిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు దీక్ష విరమించారు.

జగన్ రెడ్డి ముఠాను కఠినంగా శిక్షించాలి: కనపర్తి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: నాసికరం మద్యం ప్రజలకు అంటగట్టి వారి ప్రాణాలను బలి తీసుకున్న జగన్ రెడ్డి ముఠాను కఠినంగా శిక్షించాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బేవరేజస్ కార్పొరేషన్ ఎండీగా వాసుదేవరెడ్డిని నియమించుకుని ఆకాశమే హద్దుగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. ఎంతో మంది అమాయకుల మరణాలకు కారణమైన జగన్, విజయసాయిరెడ్డి, మిదున్‌రెడ్డిపై తక్షణమే కేసులు నమోదు చేయాలి. గత అయిదు సంవత్సరాలుగా మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులు లేక పోవడం వెనుక భారీ కుట్రకోణం దాగి ఉంది. దీనిపై విచారణ జరిపించి నిజానిజాలు వెలికితీయాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో బుధవారం నుంచి చేపట్టనున్న 90 రోజుల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యాచరణ పక్కాగా అమలు కావాలని కమిషనర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌పై సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. కార్యాచరణకు సంబంధించి ప్రజారోగ్య కార్మికులను ప్రాంతాలు, గృహాల వారీగా రేషనలైజేషన్, మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం మెరుగయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. నగరంలో తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల వారీగా వాణిజ్య వ్యర్థాల సేకరణకు టెండర్లు పిలవాలని ఈఈని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్.ఓబులేసు, డీసీలు శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, సీఎంవోహెచ్ డాక్టర్ శోభారాణి, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా గృహనిర్మాణాలు

నగరపాలకసంస్థ: జీఎంసీ పరిధిలో ఇళ్ల నిర్మాణపనుల గుత్తేదారులు, స్వంతంగా గృహాలు నిర్మించుకునే వారు డిసెంబరు నాటికి నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా నిర్మాణాలు పూర్తి చేసేలా అధికారులు దృష్టి సారించాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం ఇంజినీరింగ్, గృహనిర్మాణశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ లబ్ధిదారుల్లోని డ్వాక్రా సభ్యులకు బ్యాంకుల నుంచి రూ.35 వేలు రుణం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులుపై నోడల్ అధికారులు కూడా పర్యవేక్షణ చేయాలన్నారు. పనులు పూర్తయిన వాటికి బిల్లులు మౌలిక సదుపాయాల కార్యదర్శులు, గృహనిర్మాణశాఖ అధికారుల ద్వారా ఆన్‌లైన్ చేయాలన్నారు. డీసీ డి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈలు సుందర్రామిరెడ్డి, శ్రీనివాస్, ఉపాసెల్ పీవో బాలాజీబాష, గృహనిర్మాణశాఖ డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

రహదారులు ఛిద్రం.. రాకపోకలు నరకం



సీతానగర్ రైస్ మిల్లు వద్ద అధ్వాన రహదారిపై స్థానికులు తాత్కాలికంగా వేసిన ఎర్రమట్టి



సీతానగర్ నుంచి నెహ్రూనగర్‌కు వెళ్లే రహదారి



పాత కరెంట్ ఆఫీసు సమీపంలో..

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

సీతానగర్‌లో రహదారులు ఛిద్రమవ్వడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటుగా గూడ్స్‌షెడ్డు నుంచి సరకులను తరలించే లారీలు అధికంగా ప్రయాణిస్తుంటాయి. భారీలోడ్‌తో లారీలు రాకపోకలు సాగించడంతో రహదారి దెబ్బతిందని గతంలో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. తాత్కాలికంగా రహదారికి మరమ్మతులు చేశారు. సీతానగర్ 1వ వీధిలోని రైలు మిల్లు వద్ద సిమెంట్ రోడ్డు మరలా పగిలింది. ఇటీవల స్థానికులు ఎర్రమట్టితో గుంతలను పూడ్చుకొని మరమ్మతులు చేసుకున్నారు. రెండు రోజులుగా వర్షంపడటంతో మట్టి తొలగిపోతోంది. గుంతల్లో మురుగు నిలిచింది. ఇదే తరహాలో సీతానగర్ నుంచి ఆర్టీసీకాలనీకి వెళ్లే మార్గం, పాత కరెంట్ ఆఫీసు సమీపంలో రహదారులు అధ్వానంగా మారాయి. వర్షంవస్తే ఆ గోతుల్లో మురుగునీరు చేరడంతో ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనాలు అదుపుతప్పుతున్నాయని వాపోతున్నారు. సీతానగర్ 3వ వీధిలో అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గంలో చిన్నపాటి వర్షంపడితే చెరువును తలపిస్తోంది. దీంతో సీతానగర్ చుట్టుపక్కల ప్రాంతాలవాసులు ఆ రహదారి మీదుగా రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి సీతానగర్‌లో రహదారులకు మరమ్మతులు చేయాలని, డ్రైనేజి వ్యవస్థ బాగుచేసి రోడ్లపై మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సీతానగర్ నుంచి ఆర్టీసీ కాలనీకి వెళ్లేమార్గంలో..

వినియోగదారులను ఇబ్బంది పెడితే సహించం

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: వినియోగదారులను ఇబ్బంది పెడితే సహించేది లేదని గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు కేవీఎల్ఎన్ మూర్తి స్పష్టం చేశారు. ఈనాడులో ఈనెల 15న 'కాసులిస్తేనే విద్యుత్తు కనెక్షన్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎస్ఈ మూర్తి గోరంట్లలోని సెక్షన్ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో బహుళ అంతస్తుల భవనాలకు విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాలంటే చేతులు తడపాల్సి వస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని వివరించగా..స్పందించిన మూర్తి సంబంధిత సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అనంతరం కార్యాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా సర్వీసులు ఇవ్వడంలో జాప్యం జరిగితే బాధ్యులపై చర్యలుంటాయన్నారు. ఏదైన సామగ్రి కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

'ప్రజల సొమ్ముతో జగన్ ప్యాలెస్‌కు నగిషీలు'

పట్టాభిపురం: అధికారాన్ని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించకుండా జగన్ జనం సొమ్మును మంచినీళ్ల ప్రాయంలా సొంతానికి ఎడాపెడా దుర్వినియోగం చేశారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ విమర్శించారు.

పారా స్విమ్మర్‌కు అభినందన



దేవేంద్రకు ప్రశంసాపత్రం అందిస్తున్న కమిషనర్

నగరపాలకసంస్థ: నగరపాలకసంస్థ పరిధిలోని ఎన్టీఆర్ స్టేడియం స్విమ్మింగ్‌పూల్‌లో శిక్షణ పొందిన పారా స్విమ్మర్ దేవేంద్ర జాతీయ స్థాయి పారా ఈత పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కమిషనర్ ఛాంబర్‌లో కోచ్ షేక్ ఖాజామొహిద్దీన్, స్విమ్మర్ దేవేంద్రలను అభినందించారు. పారాస్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గత నెలలో విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ 2024లో ఎన్టీఆర్ స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన దేవేంద్ర పురుషుల విభాగంలో ఎస్.5 కేటగిరిలో పాల్గొని 2 బంగారు, ఒక వెండి పతకాలు గెలుచుకున్నారు. ఈనెల 19 నుంచి 22 వరకు గోవాలో జరిగే జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారని.. అక్కడ ఉత్తమ ప్రదర్శన చూపాలని కమిషనర్ ఆకాంక్షించారు.

జనరల్ మెడిసిన్ విభాగంలోనే ఔషధాల పంపిణీ

గుంటూరు వైద్యం: సర్వజనాసుపత్రి జనరల్ మెడిసిన్ విభాగం పొరుగురోగుల విభాగంలోనే ఔషధాల పంపిణీ చేసేందుకు ఈనెల 21 నుంచి ప్రత్యేక కౌంటర్ ప్రారంభిస్తున్నట్లు సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆ విభాగాన్ని మంగళవారం తనిఖీ చేసిన అనంతరం కిరణ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఈ విభాగానికి 300 మంది రోగులు వస్తున్నారన్నారు. వీరంతా మందుల కోసం మరోచోటకు వెళ్లి అక్కడ వారి వంతు కోసం వేచి ఉండాల్సి వస్తోందన్నారు.

రోడ్లపై ఆవులు.. ట్రాఫిక్ నిరోధకాలు



పాతగుంటూరు రహదారులు ఆవులకు నిలయంగా మారాయి. గుంపులుగా చేరి నడిరోడ్డుపై సేద తీరుతున్నాయి. దాదాపు లక్షన్నరకు పైగా జనాభా ఉన్న పాతగుంటూరులో అధిక శాతం మంది ప్రజలు ఇటువైపు నుంచే రాకపోకలు కొనసాగిస్తుంటారు. నడిరోడ్డుపై ఉన్న ఆవులు కారణంగా ఈ ప్రాంతంలో నిత్యం గంటల కొద్ది ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఇటీవల చాముండేశ్వరీ అనే మహిళను ఆవు పొడిచిన సంఘటనలో ఆమె తలకు తీవ్రగాయమైంది. రోడ్లపై ఉండే ఆవుల్ని అక్కడి నుంచి తొలగించాలని పలుమార్లు కార్పొరేషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - పట్నంబజారు, న్యూస్‌టుడే

వృద్ధుడి మృతిపై కేసు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: వృద్ధుడు మృతిచెందిన ఘటనపై మంగళవారం జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 4న గుంటూరు రైల్వేస్టేషన్‌లోని ఒకటో ప్లాట్‌ఫాంపై వృద్ధుడు అపస్మారకస్థితిలో పడి ఉన్నాడనే సమాచారంతో పోలీసులు జీజీహెచ్‌కు తరలించారు. అతను చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతుని పేరు, వివరాలు తెలిసినవాళ్లు జీఆర్పీ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం



గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: కొత్తపేట పోలీసులు వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొత్తపేటకు చెందిన శ్రీనివాసరావు ఈ నెల 13వ తేదీన అల్పాహారం తీసుకువస్తానని వెళ్లి తిరిగిరాలేదని అతని కోసం అన్ని చోట్ల వెతికినా కనిపించలేదని తమ్ముడు మనోరంజన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరయ్య తెలిపారు.

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: బాలుడు అదృశ్యమైన ఘటనపై మంగళవారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంపాలెం జెండా చెట్టు వీధికి చెందిన నాగూర్‌మీరా 9వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 6వ తేదీన పొన్నూరులోని బంధువుల ఇంటికని బయలుదేరి వెళ్లి అక్కడకు చేరుకోలేదని అన్ని చోట్ల వెతికినా కనిపించలేదంటూ నాయనమ్మ షంషాబీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరానాయక్ తెలిపారు.

గుంటూరు పశ్చిమ

గుంటూరు అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరు రూపు రేఖలు మార్చి అభివృద్ధి చేయడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే సాధ్యమవుతుందని మరోసారి నిరూపితమైందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవి విలేకర్లతో మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం అభివృద్ధిని గాలికి వదిలేసింది. దోచుకుని దాచుకోవడానికే ప్రాధాన్యం ఇచ్చారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన దగ్గర నుంచి అభివృద్ధి పరుగులు తీయిస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా సాధ్యం కాని శంకర్‌విలాస్ బ్రిడ్జి విస్తరణ, అభివృద్ధి పనులకు చంద్రబాబు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో రూ.98 కోట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మంజూరు చేశారు. అమరావతి రాజధాని ప్రాంతంలో ఒకటైన గుంటూరులో ట్రాఫిక్ రద్దీ పెను రీతిగా పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అప్పట్లో ఎంపీ గల్లా జయదేవ్ శంకర్‌విలాస్ బ్రిడ్జి అభివృద్ధి చేయాలని కోరారు. గత ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడంతో అది మరుగున పడింది. ఎన్నికలకు ముందు ఈ బ్రిడ్జి విస్తరణ, అభివృద్ధి చేస్తామని ఎంపీ అభ్యర్థిగా పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను ప్రజలకు హామీ ఇచ్చాం. ప్రజలు ఇచ్చిన హామీ నెరవేర్చే క్రమంలో భాగంగా మొదటి అడుగు పడింది. కేంద్రం నిధులు మంజూరు చేయడంతో బ్రిడ్జి అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి చంద్రశేఖర్, అధికారులతో చర్చించి శ్రీకారం చుడతామని ఎమ్మెల్యే వివరించారు.

పనులకు ఎమ్మెల్యే మాధవి ప్రతిపాదనలు



కమిషనర్ శ్రీనివాసులుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: పశ్చిమ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే గల్లా మాధవి కమిషనర్ శ్రీనివాసులుకు అందజేశారు. మంగళవారం కమిషనర్ ఛాంబర్‌లో అభివృద్ధి పనులపై చర్చించి పలు సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సంపత్‌నగర్‌లో ప్రధాన రహదారి విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనేక ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగడం లేదని వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని కోరారు. నాయీబ్రాహ్మణ కాలనీలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలన్నారు. నియోజకవర్గంలో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి సిబ్బందిని ఏర్పాటు చేయడంతోపాటు యంత్రసామగ్రి అందుబాటులో ఉంచాలని తెలిపారు.

లక్ష్మీపురం కూడలిలో అష్టకష్టాలు

నత్తనడకన సాగుతోన్న పనులు



కూడలి ఫ్రీలెఫ్ట్‌లో నిలిచిన మురుగునీరు



కల్వర్టు పనులు ఇలా..

పట్టాభిపురం, న్యూస్‌టుడే

వేలాది వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే లక్ష్మీపురం కూడలిలో వాహనచోదకుల అష్టకష్టాలు పడుతున్నారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు రెండు నెలలు దాటినా కొనసా...గుతూనే ఉన్నాయి. నగరపాలక సంస్థ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఈ పరిస్థితి దాపురించిందని ప్రజలు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో అయిదేళ్లపాటు అస్తవ్యస్తంగా ఉన్న రహదారిలో వాహనచోదకులు నానా ఇక్కట్లు పడ్డారు. ఆ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించకుండా, ఫ్రీలెఫ్ట్ సక్రమంగా అభివృద్ధి చేయకుండానే ట్రాఫిక్ సిగ్నల్స్ అమలు చేశారు. దీంతో అటువైపు రాకపోకలు సాగించే వాహనచోదకుల యాతన వర్ణనాతీతం. అప్పట్లో పాలకులు, అధికారులకు ప్రజలు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోలేదు. చిన్నపాటి వర్షం కురిసినా ఫ్రీలెఫ్ట్‌లో రోడ్డు తటాకాన్ని తలపించేది. అటువైపుగా వెళ్లే వీల్లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఆ ప్రాంతంలో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.25 లక్షలు మంజూరయ్యాయి. అయితే అధికారుల పర్యవేక్షణ లేమి కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో రాకపోకలకు వాహనచోదకులు పడుతున్న బాధలు అన్నీఇన్నీకావు. ఆగస్టు మొదటి వారంలో ప్రారంభమైన డ్రెయిన్, కల్వర్టు పనులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. అధికారులు సక్రమంగా పట్టించుకోక పోవడంతో గుత్తేదారు ఇష్టారాజ్యమైపోయింది. తారు రోడ్డు ఎత్తుగా, సిమెంట్ రోడ్డు పల్లంగా ఉండటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సిమెంట్ రోడ్డులో మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమల వ్యాప్తి పెరుగుతోంది. పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. తారు రోడ్డు కోసుకుపోయి గుంతలు పడటంతో వాహనాల టైర్లు జారిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు ఆ ప్రాంతంలో పనులు జరుగుతున్న తీరును పర్యవేక్షించి వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ఎప్పటికి పూర్తయ్యేనో....

అధికారులకు కార్యాచరణ ప్రణాళిక, ముందుచూపు లేకపోవడం వల్ల పనులు ముమ్మరంగా సాగడం లేదు. కనీసం డ్రెయిన్ కూడా పూర్తిగా నిర్మించలేదు. పలితంగా వర్షపునీరు, మురుగునీరు ఏకమై రోడ్డు మీదకు చేరుకొని నిల్వ ఉంటోంది.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: టౌన్-2 సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేస్తున్నందున ఈనెల 16న విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈఈ గురవయ్య తెలిపారు. దీని వల్ల బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు రవీంద్రనగర్, శ్యామలనగర్, స్తంభాలగరువు, ఆదేవిధంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పట్టాభిపురం, డీఆర్ఎం కార్యాలయ రహదారి తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని వెల్లడించారు.

శ్రావ్యంగా శాస్త్రీయ సంగీత కచేరీ

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సమాజ 46వ వార్షికోత్సవం, వాగ్గేయకారుల సంగీత మహోత్సవాలు రెండు రోజులుగా జరుగుతున్నాయి.



ఇందులో భాగంగా మంగళవారం త్యాగరాజస్వామి కలావేదికపై విశాఖపట్టణానికి చెందిన సంగీత విద్వాంసురాలు లలిత చంద్రశేఖర్ శిష్యబృందం సంగీత కచేరీ జరిగింది. అనంతరం వాగ్గేయకారుల కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. కచేరీకి వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై వీరన్నబాబు వాద్య సహకారాన్ని అందించారు. సంస్థ కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్, ఉపాధ్యక్షుడు ఎస్.గిరిజాశంకర్ కళాకారులను సత్కరించారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి సాయం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. అతని కుటుంబ సభ్యులకు ఫ్లాగ్‌ఫండ్, చేయూత పథకం నిధులు రూ.1.75 లక్షలు చెక్కును మంగళవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తన కార్యాలయంలో అందజేశారు.

సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

గోరంట్ల, న్యూస్‌టుడే: స్థానిక బొంతపాడు సమీపంలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచన, అగ్ని ప్రతిష్ఠాపన, పంచగవ్యప్రాసన, స్వామివారి విగ్రహాల జలాధివాసం కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం దత్తహోమం, నైవేద్య నీరాజన మంత్రపుష్ప కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని వెల్లడించారు.

వినియోగదారులను ఇబ్బంది పెడితే సహించం

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: వినియోగదారులను ఇబ్బంది పెడితే సహించేది లేదని గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు కేవీఎల్ఎన్ మూర్తి స్పష్టం చేశారు. ఈనాడులో ఈనెల 15న 'కాసులిస్తేనే విద్యుత్తు కనెక్షన్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎస్ఈ మూర్తి గోరంట్లలోని సెక్షన్ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో బహుళ అంతస్తుల భవనాలకు విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాలంటే చేతులు తడపాల్సి వస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని వివరించారు. స్పందించిన మూర్తి సంబంధిత సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అనంతరం కార్యాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా సర్వీసులు ఇవ్వడంలో జాప్యం జరిగితే బాధ్యులపై చర్యలుంటాయన్నారు. ఏదైన సామగ్రి కొరత ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు.

చదరంగం పోటీలు ప్రారంభం

గుంటూరు క్రీడలు: రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు గోరంట్లలోని నెక్సస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో మంగళవారం ప్రారంభమయ్యాయి. లీలావతి మెమోరియల్ అండర్-15 బాలబాలికల చదరంగం పోటీలను పాఠశాల అకడమిక్ డైరెక్టర్ లక్ష్మీగాయత్రి ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి 250 మంది వరకు పోటీలకు హాజరయ్యారని చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జగదీష్ తెలిపారు.

నేటి నుంచి ఈశా ఫౌండేషన్ ఇన్నర్ ఇంజినీరింగ్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 22 వరకు ఉచితంగా ఇన్నర్ ఇంజినీరింగ్ శిక్షణా తరగతులు జరుగుతాయని ఈశా వాలంటీర్ సాంబశివరావు తెలిపారు. బీజేఏస్ కళాశాలలో ఈ తరగతులు ఉంటాయన్నారు. ఇన్నర్ ఇంజినీరింగ్ అనేది సద్గురు రూపకల్పన చేసిన ఒక పరివర్తన కార్యక్రమం. ఇందులో సులభమైన యోగ సాధన, సద్గురు సూచనలతో రూపొందించిన ప్రక్రియలు ఉంటాయన్నారు. వివరాలకు 99493 12299 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నిధుల విడుదలపై ధన్యవాదాలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: నిధులు విడుదల చేయడంపై కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సీఆర్ఐఎఫ్ 'సేతు బంధన్' పథకంలో జిల్లాలోని గుంటూరు-నల్లపాడు రైల్వే సెక్షన్‌లో 4 లైన్లు, శంకర్‌విలాస్‌వంతెన నిర్మాణానికి రూ.98 కోట్లు ఆమోదించినట్లు కేంద్ర మంత్రి గడ్కరీ ప్రకటించడం అభినందనీయమన్నారు. శంకర్‌విలాస్‌వంతెన విస్తరణ విషయంలో వైకాపా తరఫున గతంలో ప్రజాప్రతినిధులు కలిసి విన్నవించినట్లు తెలిపారు.

ఎన్‌సీసీ ఆర్‌డీసీకి ఎంపిక

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ ఆర్‌డీసీకి ఎంపికైన పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల విద్యార్థి తంగెళ్లపల్లి బోసు అనుదీప్ కృష్ణను కార్యదర్శి విష్ణువర్ధన్ అభినందించారు. ఈనెల 4 నుంచి 13 వరకు నిర్వహించిన శిబిరంలో అనుదీప్ కృష్ణ ప్రతిభ కనబరిచి సికింద్రాబాద్‌లో జరిగే ఆర్‌డీసీకి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జనరల్ మెడిసిన్ విభాగంలోనే ఔషధాల పంపిణీ

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రి జనరల్ మెడిసిన్ విభాగం ఓపీలకు వచ్చే రోగులకు విభాగంలోనే ఔషధాల పంపిణీ చేసేందుకు ఈనెల 21 నుంచి ప్రత్యేక కౌంటర్ ప్రారంభిస్తున్నట్లు సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆ విభాగాన్ని మంగళవారం తనిఖీ చేసిన అనంతరం కిరణ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఈ విభాగానికి 300 మంది రోగులు వస్తున్నారన్నారు. వీరంతా మందుల కోసం మరో చోటకు వెళ్లి అక్కడ వారి వంతు కోసం వేచి ఉండాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు అక్కడే కొత్తగా మందుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదేవిధంగా అక్కడ నిరుపయోగంగా ఉన్న వీల్‌ఛైర్, స్ట్రెచర్లను వెంటనే రోగులకు అందుబాటులో తేవాలని ఆదేశించినట్లు తెలిపారు. గుండె జబ్బుల ఓపీలో ఒకే పరికరం మరమ్మతులకు గురైనందున అక్కడ మరొకటి ఏర్పాటు చేయాలని సూచించినట్లు తెలిపారు. ఈసీజీ పరీక్షలు చేయించుకుంటున్న వారి వివరాలు ప్రత్యేకంగా నమోదు చేయాలని సూచించానన్నారు. ట్రెడ్ మిల్ పరీక్షలు సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ ఉండాలన్నారు. సూపరింటెండెంట్‌తోపాటు ఆచార్య సుధీర్, సీఎస్ఆర్ఎంవో సతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ గంగమ్మ, ఈఈ రమణ తదితరులున్నారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన గుంటూరుసిటీ, విద్యాసగర్ 3వ లైను కాపురస్తురాలు "కృష్ణా ఇన్‌ఫ్రా" ప్రొ॥ భవనం శ్రీనివాసరెడ్డి గారి భార్య భవనం కృష్ణకుమారి గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, షెడ్యూలు ఆస్తి, మరికొంత ఆస్తి తొలుత గుండవరపు రామలింగం గారి భార్య చినామణి దేవి గారికి గుంటూరు జిల్లా రిజిస్ట్రారు నందు రిజిష్టరు కాబడిన రిజిష్టర్ పార్టిషన్ దస్తావేజు నెం.3566/1948 ది.04-11-1948 ద్వారా సర్వహక్కులతో సంక్రమించిన దనియు, సదరాస్తిలో కొంత ఇతరులకు విక్రయించగా మిగిలిన ఆస్తి గురించి సదరు చినామణి దేవి గారు ది.28-04-2009న ఒక అన్‌రిజిష్టరు వీలునామాను వ్రాయించి సదరు వీలునామా ఎట్టి మార్పులు గానీ, రద్దుపరచుట గానీ చేయకనే చినామణి దేవి గారు ది.15-12-2009న స్వర్గస్తురాలు అయినారనియు,సదరు వీలునామాలోని అంశముల ప్రకారం అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమారుడు జయప్రకాష్ జీవించియున్నంతవరకు తన పోషణ నిమిత్తం అవసరమైన యెడల తన ఆస్తి యావత్తు అమ్ము అధికారం తన అల్లుడైన నల్లూరి సుబ్బారావు గారికి ఇచ్చినారనియు, తన కుమారుడు మరణానంతరము నిల్వవున్న ఆస్తి తన మనుమడైన నల్లూరి నరేంద్రనాద్@ఫిలిప్స్, S/o. సుబ్బారావుకు మరియు తన కుమార్తె నల్లూరి జయప్రదాదేవి, మనమడు అయిన జేమ్స్ రవిలకు సర్వహక్కులతో సంక్రమించ వలసినదిగా పేర్కొనబడినదనియు, సదరు జయప్రకాష్ ది.01-04-2023న స్వర్గస్తులైనారనియు తద్వారా సదరు పై వీలునామా ప్రకారం నేటికి నిల్వయున్న షెడ్యూలు ఆస్తిపై నరేంద్ర @ ఫిలిప్స్ మరియు జేమ్స్‌రవిలకు మాత్రమే సర్వాధికారములు కలిగి యున్నను సదరు వీలునామా అన్‌రిజిష్టరు అయినందున సదరు చినామణి దేవి గారి వారసురాలైన నల్లూరి జయప్రదాదేవి గారితో కలిసి నల్లూరి నరేంద్ర@ఫిలిప్స్ మరియు జేమ్స్ రవిలు సదరు ఆస్తిపై తమకు మాత్రమే హక్కులు కలవని తెలియజెప్పుచూ నాక్లయింటుకు అమ్మజూపినారు. కావున సదరు ఆస్తిపై ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములైననూ ఉన్నయెడల ఈ తేది లగాయతు 15 రోజులలోగా ఈ క్రింది తెలుపబడిన చిరునామా నందు తగు లిఖితపూర్వక ఆధారాలతో సంప్రదించగలరు. గడువులోగా ఎట్టి అభ్యంతరములు రానియెడల సదరు ఆస్తి నిష్పేచి ఆస్తిగా భావించి నాక్లయింటు కొనుగోలుచేయగలరు. గడువుతేది పిదప వచ్చు ఎట్టి అభ్యంతరములైననూ నాక్లయింటును బంధింపజాలవని తెలియజేయడమైనది.

షెడ్యూలు: గుంటూరు డి॥ & సబ్.డి॥.,ప్రస్తుతము కొరిటెపాడు సబ్.డి., గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ యేరియాలో చేరిన గుంటూరు సిటి, సాయిబాబా రోడ్డు లోని కొరిటెపాడు గ్రామం తాలూకు డి.నెం.32రు విస్తీర్ణం 2-85 సెంట్లు మింజుమలె చ.గ.559 ల ఖాళీ నివేశన స్థలమునకు **హద్దులు:తూర్పు:** కొడాలి అప్పయ్య చౌదరి గారి ఆస్తి హద్దు, **దక్షిణం:** గోగినేని వెంకటరామయ్య గారి ఆస్తి హద్దు, **పడమర:** అ.30లు వెడల్పు గల రోడ్డు హద్దు, **ఉత్తరం:** పూదోట బాలరాజు గారి ఆస్తి హద్దు.


గోవిందు సుధామాధురి, అడ్వకేట్ & నోటరీ
ప్లాటు నెం.201, హనుమాన్ హైట్స్, 3వ లైను ఆంజనేయ పేట, అమరావతిరోడ్డు, గుంటూరు, సెల్: 94402 60307

ఆంజనేయస్వామికి వెండి సర్వాంగం సమర్పణ

పట్నంబజారు, న్యూస్‌టుడే: పాతగుంటూరులోని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలోని స్వామివారికి మంగళవారం స్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా చిరుమామిళ్ళ వెంకట కృష్ణారావు, లక్ష్మీ దంపతులు వెండి నూతన సర్వాంగం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి దంపతుల్ని శాలువతో సత్కరించారు.



రంగారావుకు నివాళి



నవభారత్‌నగర్: జేకేసీ కళాశాలరోడ్డులోని రాయపాటి వెంకట రంగారావు విద్యా కళాశాలలో మంగళవారం రాయపాటి వెంకట రంగారావు జయంతి నిర్వహించారు. రంగారావు-సీతారావమ్మ విగ్రహాలకు నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యదర్శి గద్దె మంగయ్య, ప్రిన్సిపల్ ఆచార్య ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం ఒక స్ఫూర్తి శిఖరం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అబ్దుల్ కలాం అంటే ఒక స్ఫూర్తి శిఖరమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ యువత అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుంటే ఏ రంగంలో అయినా విజయం సాధిస్తారన్నారు. అరుదైన వ్యక్తిత్వం ఆయన సొంతం. నిరాడంబరంగా జీవించి అసామాన్య విజయాలను అందుకున్న మిసైల్ మ్యాన్ అబ్దుల్ కలాం... అని కొనియాడారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు సుఖవాసి శ్రీనివాసరావు, మొవ్వా వేణు, యాకోబ్, సంజయ్, రామారావు, ప్రసాద్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే గల్లా మాధవి



వాకర్స్ ఆధ్వర్యంలో..

గుజ్జనగుండ్ల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూర్వ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. వాకింగ్ ట్రాక్ వద్ద అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాళ్లూరి సాంబశివరావు, మదర్‌ఖాదర్, మల్లికార్జునరావు, కేవీకే ప్రసాద్, గోపి తదితరులు పాల్గొన్నారు. - **గుజ్జనగుండ్ల(ఎస్వీఎన్‌కాలనీ)**



వైకాపా కార్యాలయంలో..

దివంగత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మంగళవారం బృందావనగార్డెన్స్‌లోని వైకాపా కార్యాలయంలో సభ జరిగింది. వైకాపా గుంటూరు పార్లమెంటు పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, వైకాపా అధ్యాపక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **-గోరంట్ల, న్యూస్‌టుడే**

ఐఎంఏ 12 గంటల దీక్ష

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: పశ్చిమబెంగాల్‌లో జూనియర్ వైద్యులు చేపట్టిన నిరవధిక దీక్షకు మద్దతుగా భారత వైద్య సంఘం(ఐఎంఏ) గుంటూరు శాఖ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఐఎంఏ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ దీక్ష కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు(ఎలక్ట్) నందకిశోర్ తోపాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పట్టాభిపురం: ఏడుగురు జూదరులను అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. గౌతమి నగర్‌లోని ఒక ఇంట్లో జూదం ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు జూదగృహంపై దాడి చేసి ఏడుగుర్ని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.37,490 నగదు స్వాధీనం చేసుకున్నారు.

మహిళల నిరాహార దీక్ష విరమణ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గత అయిదేళ్ల వైకాపా పాలనలో ఆపార్టీ నాయకుల చేసిన అక్రమాలపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరుతూ వికాస్‌నగర్‌లో ఆదర్శ మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలు చేస్తున్న నిరాహార దీక్షను ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు విరమింపజేశారు. స్వర్ణభారతినగర్‌కు చెందిన కోవూరు శ్రీలక్ష్మి మరో ఇద్దరు మహిళలతో కలిసి వికాస్‌నగర్‌లోని ఇంట్లో మూడు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైకాపా నాయకులు పేదల ఇళ్లస్థలాలను ఆక్రమించి అమ్ముకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను పలుమార్లు కోరినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లామన్న అక్కసుతో వైకాపా గుండాలు తమపై దాడి చేసినా పోలీసులు, అధికారులు పట్టించుకోలేదు. అందుకే తాము ఈ దీక్ష చేపట్టామని ఎమ్మెల్యే రామాంజనేయులుకు మహిళలు తెలిపారు. దీనికి ఆయన స్పందిస్తూ వైకాపా నాయకులపై కేసులు నమోదు చేయించి అరెస్ట్ చేయిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు దీక్ష విరమించారు.



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
97042 53525, 80085 74897

? స్థానిక ఏటి అగ్రహారం 14వ లైన్ 2వ అడ్డరోడ్డులోని వీధి దీపం(42క్యా/5) కొన్ని రోజులుగా వెలగడం లేదు. రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. **-స్థానికులు, కోబాల్డ్‌పేట**

✔ వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **-రవికిరణ్, ఏఈ, జీఎంసీ**

చెట్టుకొమ్మల తొలగింపు

స్థానిక భారతీయవిద్యా భవన్ పక్క దారి చెట్టుకొమ్మలుతో అపరిశుభ్రంగా తయారైంది. ఈ సమస్యను స్థానికులు ఈనాడు 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ సోమశేఖర్‌కు తెలిపారు. ఆయన స్పందించి 83 సచివాలయ శానిటరీ కార్యదర్శి సంజయ్ నాయక్, పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి రహదారిపై చెట్టుకొమ్మలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

కాలువల్లో పూడికతీత

నల్లకుంటలోని కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు ముందుకు కదలక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం..మీకు తోడుగా'కు తెలిపారు. ఈ విషయాన్ని జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి 97 సచివాలయ శానిటరీ కార్యదర్శి రమేష్, సిబ్బందిని పంపించి నల్లకుంటలోని 1వ లైన్ నుంచి 12వ లైన్ వరకు కాలువల్లోని పూడిక తొలగించేలా చర్యలు తీసుకున్నారు.
-న్యూస్‌టుడే, ఏ.టి.అగ్రహారం

'జనం సొమ్ముతో జగన్ ప్యాలెస్‌కు నగిషీలు'

పట్టాభిపురం: అధికారాన్ని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించకుండా జగన్ జనం సొమ్మును మంచినీళ్ల ప్రాయంలా సొంతానికి ఎడాపెడా దుర్వినియోగం చేశారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ విమర్శించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పెద్ద ఎత్తున ప్రజల సొమ్మును దోచుకుని ప్యాలెస్‌లో దాచుకున్నందునే అటువైపు జనం ఎవ్వరూ వెళ్లకుండా రహదారి మూసి వేయించారు. రూ.2 లక్షల విలువ చేసే అసెంబ్లీ ఫర్నిచర్‌ను వాడుకున్నారని మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావుపై అభియోగం మోపి వెంటాడి వేధించి పొట్టనపెట్టుకున్నారు. రూ.వందలాది కోట్ల ప్రజల సొమ్ముతో సొంత భవనానికి హంగులు సమకూర్చుకున్న జగన్‌ను ఏమి చేయాలని ప్రశ్నించారు. అయిదేళ్లపాటు అధికారాన్ని అడ్డుపెట్టుకుని దోచుకున్న సొమ్మును వడ్డీతో సహా వసూలు చేయాలని మోహనకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు.

'వైకాపా హయాంలో నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలు బలి'

పట్టాభిపురం, న్యూస్‌టుడే: నాసికరం మద్యం ప్రజలకు అంటగట్టి వారి ప్రాణాలను బలి తీసుకున్న జగన్ రెడ్డి ముఠాను కఠినంగా శిక్షించాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బేవరేజస్ కార్పొరేషన్ ఎండీగా వాసుదేవరెడ్డిని నియమించుకుని ఆకాశమే హద్దుగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. ఎంతో మంది అమాయకుల మరణాలకు కారణమైన జగన్, విజయసాయిరెడ్డి, మిదున్‌రెడ్డిపై తక్షణమే కేసులు నమోదు చేయాలి. గత అయిదు సంవత్సరాలుగా మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులు లేక పోవడం వెనుక భారీ కుట్ర కోణం దాగి ఉంది. దీనిపై విచారణ జరిపించి నిజానిజాలు వెలికితీయాలని డిమాండ్ చేశారు.